విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు

విజయ సారథి
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక

టీవీ రిపోర్టర్లు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499
VISION TV
యండి. పి.వెంకటేశ్వర్లు

చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | శుక్రవారం 13-06-2025 | సంపుటి : 11 | సంచిక : 138 | పేజీలు : 8 | వెల : రూ 3-00
కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

# విమాన ప్రమాదం.. విజయోత్సవసభ వాయిదా



అమరావతి, జూన్ 12: అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా నిర్వహించ తలపెట్టిన విజయోత్సవ సభను రేపటికి (శుక్రవారం) వాయిదా వేసింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం కారణంగా సభను వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మరోవైపు అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విమాన ప్రమాదంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. ఘోర దుర్ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఈరోజు (గురువారం) సాయంత్రం తలపెట్టిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. కాగా.. అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాద సమయంలో విమానంలో ప్రయాణికులు, సిబ్బంది కలిసి మొత్తం 242 మంది ఉన్నారు. ఈ ప్రమాదంలో మొత్తం 242 మంది మరణించారు. ప్రస్తుతం ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇక ఈ విమానంలో ప్రయాణిస్తున్న గుజరాత్ మాజీ సీఎం విజయ్ రుపానీ కూడా మరణించారు. లండన్‌లో ఉన్న కుమార్తె వద్దకు వెళ్తుండగా విమాన ప్రమాదంలో విజయ్ రూపానీ ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోదీ సహా రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేస్తూ ట్వీట్లు చేశారు.

# అహ్మదాబాద్‌లో కూలిన ఎయిర్ ఇండియా విమానం..


## కుప్పకూలిన విమానం.. 242 మందికి పైగా ప్రయాణికులు..

అహ్మదాబాద్,జూన్12 అహ్మదాబాద్‌లో ఇవాళ జరిగిన విమాన ప్రమాదంలో 242 మంది మరణించారు. విమానాశ్రయం నుంచి టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాల్లోనే ఆ విమానం కూలింది. ప్రమాదం నుంచి ఎవరూ బ్రతికినట్లు- లేరని అహ్మదాబాద్ పోలీసు కమిషనర్ జీఎస్ మాలిక్ తెలిపారు. అంతర్జాతీయ మీడియా సంస్థ ద అసోసియేటెడ్ ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. రెసిడెన్షియల్ ప్రాంతంలో విమానం కూలడం వల్ల అదనంగా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు ఆయన చెప్పారు. అయితే బోయింగ్ డ్రీమ్‌లైనర్ ప్రమాదం వల్ల మొత్తం ఎంత మంది చనిపోయారన్న



విషయాన్ని ఇప్పుడే చెప్పలేమని, దానిపై త్వరలో ప్రకటన చేస్తామన్నారు. ప్రమాద సమయంలో విమానంలో 232 మంది ప్రయాణికులు, 10 మంది సిబ్బంది ఉన్నారు. విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటీ-ష్ జాతీయులు, ఏడు మంది పోర్చుగీస్, ఓ కెనడా దేశస్థుడు ఉన్నారు. అహ్మదాబాద్‌లోని మేఘనీనగర్ ఏరియాలో ఉన్న దార్‌పుర్‌లో విమానం కూలింది. ఎమర్జెన్సీ బృందాలు ఆ ప్రాంతానికి హుటాహుటిన చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. ఏ కారణం చేత ప్రమాదం జరిగిందో అధికారులు ఇంకా నిర్ధారించలేదు. విమానంలో ప్రయాణిస్తున్న మాజీ సీఎం విజయ్ రూపానీ మృతిచెందినట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది.

# రాష్ట్రంలో భారీ వర్షాలు..



విశాఖపట్నం, జూన్ 12: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉందని విశాఖపట్నంలోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. అలాగే ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశాలో ప్రసుత్తం ఉపరితల ఆవర్తనం విస్తరించిందని తెలిపింది. ఈ ప్రభావం కారణంగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే కోస్తా ఆంధ్రాలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడతాయని చెప్పింది. కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందంది. ఈ సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నంలోని వాతావరణ శాఖ సూచించింది. మరో వైపు అనుకున్న సమయానికంటే ముందే నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించాయి. దీంతో ఇప్పటికే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇంకోవైపు కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. అయితే ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండడంతో.. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడనున్నాయి.

# విమాన ప్రమాదంతో షాక్‌కు గురయ్యా.. చంద్రబాబు ట్వీట్

అమరావతి , జూన్ 12: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ ( స్పందించారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమానం ప్రమాదంతో షాక్‌కు గురైనట్లు సీఎం తెలిపారు. చనిపోయిన ప్రయాణికుల కుటుంబాలకు, సిబ్బంది కుటుంబాలకు, స్థానిక ప్రజల్లో చనిపోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. విమాన ప్రమాదంపై మంత్రి నారా లోకేష్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం



చేశారు. అహ్మదాబాద్ నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిర్ ఇండియా లండన్‌కు చెందిన బోయింగ్ డ్రీమ్ లైనర్ విషాదకరమైన ప్రమాదంతోగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. ఈ ఘటనపై మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 242 మందితో ప్రయాణిస్తున్న విమానం మేఘని నగర్ సమీపంలో బయలుదేరిన కొద్ది నిమిషాలకే కూలిపోయిందని తెలిపారు. ఈ ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు తన హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేశారు. ఈ వినాశకరమైన సంఘటనలో మరణించిన వారి ఆత్మ శాంతి కోసం ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన రక్షణ, ఉపశమనం, కారణంపై సమగ్ర దర్యాప్తును చేపట్టాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కేంద్రానికి మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.


# విమనప్రమాదంపై పవన్ దిగ్భ్రాంతి

## సంతాపం తెలిపిన హరీష్ రావు

హైదరాబాద్,జూన్12: అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న విమాన ప్రమాదంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ఇది ఊహించలేని ఘటన అని, దేశమంతా బాధిత కుటుంబాలకు అండగా నిలబడాల్సిన సమయమని అన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానం కుప్పకూలిపోవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలుపుతూ.. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పేర్కొన్నారు. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులకు బలం చేకూరాలని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం

**టేకాఫ్ అయిన కాసేపటికే కుప్పకూలిన ఎయిరిండియా విమానం**
**విమానంలో ఉన్న 242 మంది దుర్మరణం**
**మృతుల్లో మాజీ సిఎం విజయ్ రూపానీ**
**ఘటనపై ఆరా తీసిన హోంమంత్రి అమిత్ షా**



గాంధీనగర్,జూన్12 : మహా ఘోరం జరిగింది. గుజరాత్‌లో ఘోర విమానప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో దాదాపు 242మంది మృత్యువాత పడ్డారు. మృతుల్లో మాజీ సిఎం విజయ్ రూపానీ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అహ్మదాబాద్‌లో గురువారం మధ్యాహ్నం ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. మేఘానిలో ఎయిర్ఇండియా విమానం కూలిపోయింది. సివిల్ ఆస్పత్రి సమీపంలో విమానం చెట్టును ఢీకొట్టిన అనంతరం జనావాసాలపై కూలింది. టేకాఫ్ అయిన వెంటనే విమానం కూలి పోయింది. 242 మంది ప్రయాణికులతో ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 అనే విమానం అహ్మదాబాద్ నుంచి లండన్ కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. విమానంలో ఉన్న 242 మృతి చెంది ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఎయిర్ ఇండియా కూడా ఎక్స్ వేదికగా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతో పాటు ఒక కెనడా వాసి ఉన్నట్లు వెల్లడించింది. ఇందులో గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ కూడా ఉన్నారు. అంబులెన్స్‌లు, ఫైరింజిన్లు ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బిఎస్ఎఫ్ సిబ్బంది సిబ్బంది సహాయకచర్యల్లో పాల్గొన్నారు. పరిసరప్రాంతాల్లో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. 2కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు గుజరాత్ కు బయల్దేరారు. ప్రమాదంపై గుజరాత్ సిఎంకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఫోన్ చేసి ఆరా తీశారు. విమానంలో మాజీ సిఎం విజయ్ రూపానీ ఉన్నట్లు సమాచారం. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం లండన్ బయల్దేరిన ఫ్లయిట్ నెంబర్ ఏఐ-171 విమానం కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో దానిలో 242 మంది ప్రయాణికులు ఉన్నారు. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదానికి గురైంది. మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఆ ప్రదేశం నుంచి దట్టమైన నల్లటిపొగ అన్ని వైపులకు వ్యాపించింది. ఫ్లైట్ రాడార్ 24 ప్రకారం విమానం 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయింది. ఈ క్రమంలో మధ్యాహ్నం1.39 సమయంలో పూర్తిగా కిందకు దిగిపోయి చెట్టును ఢీకొన్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి గురైన విమానం వైడ్‌బాడీ బోయింగ్ 787 డ్రీమ్ లైనర్. దీనిలో 300 మంది ప్రయాణించవచ్చు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై స్పందించిన ఎయిర్ ఇండియా చైర్మన్ చంద్రశేఖరన్

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయింది. 242 మంది ప్రయాణికులతో లండన్‌కు బయలుదేరిన విమానం.. టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకు కూలిపోయింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు వంద మందికిపైగా మృతి చెందినట్లు సమాచారం. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో ఎంత మంది మరణించారో అధికారులు నిర్ధారించలేదు. ప్రమాదం నేపథ్యంలో అహ్మదాబాద్ విమానాశ్రయాన్ని మూసివేశారు. ప్రస్తుతం అన్ని కార్యకలాపాలు నిలిపివేశారు. ఎయిర్ ఇండియా చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఎయిర్ ఇండియా ఫ్లయిట్ ఏఐ-171 ప్రమాదాన్ని ధ్రువీకరించారు. బాధితులు, కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. ప్రస్తుతం వారికి సహాయం చేయడంపైనే ప్రాథమికంగా దృష్టి సారించినట్లు తెలిపారు. విషాదకర ఘటనపైగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన.. ఘటనతో ప్రభావితమైన వారందరి కుటుంబాలు, ప్రియమైన వారి గురించే తమ ఆలోచనలు ఉన్నాయని.. వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు.



సంఘటనా స్థలంలో అత్యవసర ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలకు సహాయం చేసేందుకు..అవసరమైన మద్దతు అందించేందుకు తమ శక్తి మేరకు ప్రతిదీ చేస్తున్నామన్నారు. ప్రమాదం నేపథ్యంలో సమాచారం అందించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని.. అవసరమైన సమాచారం అందిస్తుందన్నారు. సమాచారం అందించిన వెంటనే మిగతా వివరాలు పంచుకుంటామన్నారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఇండిగో స్పందించింది. ఈ సమయంలో ఎయిర్ ఇండియాకు అండగా నిలుస్తామని వెల్లడించింది.

# సంపాదకీయం

శుక్రవారం 13-06-2025

## విమర్శలకు కేంద్రబిందువుగా ట్రంప్ పాలనా విధానాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనా విధానాలు మరోసారి విమర్శలకు కేంద్రబిందువుగా మారాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ, తనకు వ్యతిరేకమైన వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారన్న ఆరోపణలు ట్రంప్‌పై బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌తో ఆయన విభేదాలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ట్రంప్ వ్యక్తిగత రాగద్వేషాలను పాలనా విధానంగా మలచుకుంటున్నారని, ఇది అమెరికా ప్రజాస్వామ్యానికి ముప్పు తెచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్య సంబంధాలు ఒకప్పుడు ఆహ్లాదకరంగా ఉండేవి. 2016 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం తర్వాత, మస్క్ ఆయన ఆర్థిక సలహా మండలిలో చేరారు. అయితే, పారిస్ ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ మస్క్ ఆ పదవికి రాజీనామా చేశారు. 2022లో ట్రంప్ రాజకీయ జీవితం నుంచి తప్పుకోవాలని మస్క్ సూచించినప్పటికీ, 2024 ఎన్నికల్లో రిపబ్లికన్ల విజయం కోసం 25 కోట్ల డాలర్లు విరాళంగా ఇచ్చి ట్రంప్‌కు మద్దతు పలికారు. అయినప్పటికీ, వ్యాపార, రాజకీయ అవసరాలతో ప్రారంభమైన ఈ బంధం ఇప్పుడు విడిపోయే దశకు చేరింది. ట్రంప్, మస్క్ సంస్థలకు ఇచ్చిన ప్రభుత్వ రాయితీలు, కాంట్రాక్టులను రద్దు చేస్తానని బెదిరించడం ఈ విభేదాలను మరింత తీవ్రతరం చేసిందిమస్క్ నేతృత్వంలోని స్పేస్‌ఎక్స్, అమెరికా అంతరిక్ష పరిశోధనలో కీలక పాత్ర పోషిస్తోంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వ్యోమగాములను, ఆహారం, పరికరాలను తరలించేందుకు స్పేస్‌ఎక్స్ యొక్క డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌పై నాసా ఎక్కువగా ఆధారపడుతోంది. గత ఎనిమిదేళ్లలో స్పేస్‌ఎక్స్‌కు 2,000 కోట్ల డాలర్లకు పైగా ప్రభుత్వ కాంట్రాక్టులు లభించాయి. ట్రంప్ ఈ కాంట్రాక్టులను రద్దు చేస్తే, అమెరికా అంతరిక్ష పరిశోధనలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మస్క్ ఒకవైపు ఈ సేవలను ఉపసంహరించే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, తర్వాత వెనక్కి తగ్గారు, దీనివల్ల ఈ వివాదం మరింత జటిలమైంది.ట్రంప్, మస్క్ మధ్య విభేదాలకు మరో కారణం హరిత ఇంధన విధానాలు. విద్యుత్ వాహనాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిధులను కుదించేందుకు ట్రంప్ సర్కారు ప్రతిపాదించిన బిల్లును మస్క్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టెస్లా ద్వారా విద్యుత్ వాహన రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మస్క్, ఈ విధానాలు తన వ్యాపార లక్ష్యాలకు విఘాతం కలిగిస్తాయని భావిస్తున్నారు. ఈ విషయంలో ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు ఆయన సన్నిహితులకు సైతం ఆమోదయోగ్యంగా లేవని స్పష్టమవుతోంది.ట్రంప్ ఏకపక్ష విధానాలు, వ్యక్తిగత రాగద్వేషాలను పాలనలో ప్రతిబింబించే తీరు అమెరికా ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో అనిశ్చితిని సృష్టిస్తూ, దేశ ఆర్థిక, విజ్ఞాన రంగాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ట్రంప్ ధోరణులు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉన్నాయని, ఇది అమెరికా రాజకీయ వ్యవస్థలో సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు కేవలం వ్యక్తిగత గొడవలుగా మాత్రమే కాక, అమెరికా పాలనా విధానాలు, అంతర్జాతీయ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే సమస్యగా మారాయి. అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ధోరణి, ప్రజాస్వామ్య విలువలను బలహీనపరిచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వివాదం అమెరికా రాజకీయ, ఆర్థిక భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపనుందో చూడాల్సి ఉంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించినవారిలో ఎలాన్ మస్క్ ఒకరు. అందుకే రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనను డోజ్ కు చీఫ్‌గా నియమించారు. కానీ ప్రభుత్వ ఖర్చులపై ఇరువురి మధ్య అభిప్రాయ భేదాల కారణంగా మస్క్ పదవి నుంచి ఇటీవలే వైదొలిగారు. తాను సూచనలు చేస్తుంటే.. మంత్రులు నిర్ణయాలు తీసుకుంటారని అసహనం వ్యక్తం చేశారు.ఇంతలోనే మస్క్ చేసిన ట్వీట్ సంచలనంగా మారింది. జెఫ్రీ ఎపిస్టీన్ సెక్స్ కుంభకోణంలో ట్రంప్ పేరు ఉందని ఆరోపించిన మస్క్.. ఎలాంటి ఆధారాలు చూపలేదు. తరువాత ఆ ట్వీట్లను తొలగించారు. ఈ ఆరోపణలపై ట్రంప్ స్పందిస్తూ. "ఇది పాత విషయం. ఎపిస్టీన్ లాయర్ కూడా నాకు సంబంధం లేదని ప్రకటించారు' అని అన్నారు. కేవలం తనకు ఎపిస్టీన్‌తో పరిచయం మాత్రమే ఉందని, తాను అతడితో కలిసి ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాలుపంచుకోలేదని ట్రంప్ కొట్టిపారేశారు.

## విజయ్ మాల్యా లెక్క సంగతేంటీ



హైదరాబాద్, జూన్ 12, భారతదేశంలో కేసులు ఎదుర్కొంటున్న సమయంలో దేశం విడిచి పారిపోయిన వ్యక్తులలో విజయ్ మాల్యా ఒకరు. ఆయన ఒక తెలివైన వ్యాపారవేత్త, క్రీడాభిమాని. రాజకీయ అనుభవజ్ఞుడు. కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్ మూసివేత తర్వాత మాల్యా దురదృష్టం ప్రారంభమైంది. ఆర్థిక అవకతవకలు, రుణాలు తిరిగి చెల్లించకపోవడం వంటి కొన్ని తీవ్రమైన ఆరోపణలను ఆయన ఎదుర్కొన్నారు. 2016లో దేశం విడిచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు.విజయ్ మాల్యా చెప్పిన దాని ప్రకారం, బ్యాంకుల నుండి అతను పొందిన రుణాలు రూ.4,000 కోట్ల కంటే కొంచెం ఎక్కువగా ఉండవచ్చు. వడ్డీ అంతా కలిపితే రూ.6,203 కోట్లు అవుతుంది. అయితే ప్రభుత్వం అతని ఆస్తులను స్వాధీనం చేసుకుని రూ.14,131.60 కోట్లు రికవరీ చేసినట్లు తెలుస్తోంది. అయితే తాను తీసుకున్న దానికంటే ఎక్కువ రికవరీ చేసినట్లు మాల్యా ఆరోపణ.భారతదేశంలో విజయ్ మాల్యాకు చెందిన అనేక ఆస్తులను ఈడీ, సీబీఐ, బ్యాంకులు జప్తు చేశాయి. అయితే, విజయ్ మాల్యాకు ఇప్పటికీ అపారమైన ఆస్తులు ఉన్నాయి. విజయ్ మాల్యాకు భారతదేశంలోనే కాకుండా విదేశాలలో కూడా వ్యాపారాలు ఉన్నాయి.ఫోర్బ్స్ ది ఇండిపెండెంట్ ప్రకారం.. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఎఖఒ జట్టు మాజీ యజమాని విజయ్ మాల్యా నికర విలువ 2013లో వి750 మిలియన్ల నుండి జూలై 2022 నాటికి వి1.2 బిలియన్లకు పెరిగింది. అయితే, అతని ఎయిర్‌లైన్ సామ్రాజ్యం ఆర్థిక పతనం, చట్టపరమైన సవాళు మాల్యాను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టాయి.28 సంవత్సరాల వయసులో మాల్యా యునైటెడ్ బ్రూవరీస్ గ్రూప్ చైర్మన్ అయ్యాడు. తన వ్యాపారాన్ని మద్యం, విమానయాన సంస్థలు, రియల్ ఎస్టేట్, క్రీడలలో పెట్టుబడి పెట్టాడు. దీని ద్వారా అతను తన బ్రాండ్ విలువను పెద్ద ఎత్తున పెంచుకున్నాడు. ఫార్ములా 1లో స్పాన్సర్‌షిప్ ఒప్పందాలతో అతను ఒక ప్రధాన వ్యాపారవేత్తగా ఎదిగాడు. అమెరికాలోని న్యూయార్క్‌లోని ట్రంప్ ప్లాజాలో విజయ్ మాల్యాకు ఒక పెంట్ హౌస్ ఉందని, దీనిని 2010లో వి2.4 మిలియన్లకు కొనుగోలు చేశారని తెలుస్తోంది. దీనితో పాటు, అతను ఒకే భవనంలో మూడు లగ్జరీ కాండోలను కలిగి ఉన్నాడని మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. ఈ లగ్జరీ కాండోలలో రెండు తన కుమార్తెతో కలిసి కొనుగోలు చేశాడు. దీనికి తోడు, అతను ఫ్రాన్స్‌లోని లే గ్రాండే జార్డిన్ ఎస్టేట్‌ను కలిగి ఉన్నాడు, ఇది కేన్స్ సమీపంలోని సెయింట్-మార్గరైట్ ద్వీపంలో ఉంది.

విజయ్ మాల్యా ప్రస్తుతం కలిగి ఉన్న కొన్ని ఆస్తులు:

లండన్‌లోని 19వ శతాబ్దపు, చాలా ప్రతిష్టాత్మకమైన భవనం అయిన కార్న్‌వాల్ టెర్రస్‌లోని 18, 19 ప్లాట్లలో ఆస్తులు.

బ్రిటన్‌లోని హెర్ట్‌ఫోర్డ్‌షైర్‌లో లేడీవాక్ మాన్షన్.

ముంబైలోని నేపియన్ సీ రోడ్‌లోని ఒక బంగ్లా

బెంగళూరులోని కింగ్‌ఫిషర్ టవర్‌లోని ఒక పెంట్ హౌస్

అమెరికాలోని కాలిఫోర్నియాలో ఒక భవనం

అమెరికాలోని న్యూయార్క్‌లోని ట్రంప్ ప్లాజా పెంట్‌హౌస్

ఫ్రాన్స్‌లోని సెయింట్-మార్గరీట్ ద్వీపంలో లే గ్రాండ్ జార్డిన్ ఎస్టేట్

## అందుబాటులోకి డబుల్ బెడ్ రూమ్స్ ఇళ్లు

హైదరాబాద్, జూన్ 12, హైదరాబాద్ వేగంగా విస్తరించే నగరాల్లో దేశంలో ఒకటి. ఎవరు పాలకులున్నప్పటికీ హైదరాబాద్ ఎదుగుదలను ఎవరూ ఆపలేరు. 1990వ దశకం నుంచి వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరం విస్తీర్ణం కూడా విపరీతంగా పెరిగింది. జనాభా కూడా అదే సమయంలో అంచనాలకు మించి దాటేసింది. హైదరాబాద్ లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలికవసతులు కల్పించాలంటే అధికార పార్టీలకు పెద్ద టాస్క్ అని చెప్పాలి. అన్నింటికీ అనుకూలమైన నగరంతో పాటు కాస్ట్ ఆఫ్ లివింగ్ కూడా తక్కువగా ఉండటంతో పాటు అన్ని రాష్ట్రాల ప్రజలకు చిరునామాగా మారడంతో హైదరాబాద్ కు రోజురోజుకూ జనం తాకిడి పెరుగుతుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పెద్ద పెద్ద అపార్ట్ మెంట్లు కూడా వెలుస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం ప్రధాన ఆదాయంగా వేలాది మందికి మారింది. ఇక్కడ గజం ధర ఇరవై లక్షలకు పైమాటే వీటిపైనే ఎక్కువ ఫోకస్... అయితే గత కొద్ది రోజుల నుంచి హైదరాబాద్ నగరంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు కొనుగోలు చేసే వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే డబుల్ బెడ్ రూంఇళ్లకు డిమాండ్ పెరిగింది. అయితే డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టిన బిల్డర్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి లేదు. డబుల్ బెడ్ రూం ఇళ్లు చదరపు అడుగులను అనుసరించి ధరలు పలుకుతున్నాయి. ఏరియాను బట్టి ముప్ఫయి నుంచి ప్రారంభమై అరవై లక్షల రూపాయల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు లభిస్తున్నాయి. అంటే ఒకరకంగా చూసుకుంటే చౌక ధరలకే డబుల్ బెడ్ రూం ఇళ్లు లభిస్తున్నాయి. 2023 సంవత్సరం వరకూ డబుల్ బెడ్ రూం ఇళ్లకంటే ట్రిబుల్ బెడ్ రూం ఇళ్లకు గిరాకీ ఉండేది. కానీ ప్రస్తుతం డబుల్ బెడ్ రూం ఇళ్లకు డిమాండ్ పెరిగిందని రియల్టర్లు చెబుతున్నారు. . ప్రాజెక్టులు పూర్తయినా డబుల్ బెడ్ రూం ఇళ్లు మిగిలి పోవడం లేదని బిల్డర్లు చెబుతున్నారు. ట్రిపుల్ బెడ్ రూం ఇళ్లు కొనుగోలు చేయాలంటే కనీసం ఎనభై లక్షల రూపాయల నుంచి కోటి రూపాయలకుపైగానే వెచ్చించి రావాల్సి ఉండటంతో నివాసం కోసం డబుల్ బెడ్ రూం ఇళ్లకు ప్రాధాన్యత పెరిగింది. ఎక్కువ మంది ట్రిబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళుతున్నారని బిల్డర్లు కూడా అటు వైపు మొగ్గు చూపడంతో ప్రస్తుతం డబుల్ బెడ్ రూం ఇళ్లు సరసమైన ధరలకు లభిస్తున్నాయి. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం ఎక్కువగా జరుగుతుండటంతో వాటి ధరలను కూడా తగ్గించేందుకు బిల్డర్లు సిద్ధపడుతున్నారు. కనీసం తాము పెట్టిన పెట్టుబడి పైన ఐదు నుంచి పది శాతం లాభం ఉండేలా చూసుకుని విక్రయిస్తున్నారు వాటికే డిమాండ్ అట చదరపు అడుగు లెక్కన... డబుల్ బెడ్ రూం ఇళ్లు 800 చదరపు అడుగుల నుంచి పదిహేను వందల చదరపు అడుగుల వరకూ ఉంటున్నాయి. చదరపు అడుగుకు ఇంత మొత్తం చొప్పున ప్రాంతాన్ని బట్టి బిల్డర్లు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా కొంపల్లి, మేడ్చల్ ప్రాంతంలో ఎక్కువగా ఈ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. కొంపల్లి ప్రాంతానికి మెట్రో రైలు కూడా వస్తుందని ఇటీవల ప్రభుత్వం ప్రకటించడంతో ఈ ప్రాంతంలో కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది సిద్ధపడుతున్నారు. మరో వైపు హయత్ నగర్ వైపు కూడా ఇలాంటి ఇళ్ల సంఖ్య ఎక్కువగా ఉంది. బోడుప్పల్ ప్రాంతంలో కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ మార్కెట్ స్తబ్దుగా ఉండటంతో డబుల్ బెడ్ రూం ఇళ్లను కొనుగోళ్లపై భారీ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. దీంతో వీటికి ఇప్పుడు హైదరాబాద్ నగరంలో గిరాకీ పెరిగింది.



## కాంగ్రెస్ లో ఓవర్ టూ ఢిల్లీయేనా...

హైదరాబాద్, జూన్ 12, తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణ జరిగి నాలుగు రోజులవుతుంది. రెండేళ్ల తర్వాత ఎట్టకేలకు మంత్రి వర్గ విస్తరణ చేపట్టారు. అదీ ఆరు పోస్టులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ లో ఖాళీగా ఉంటే మూడు పోస్టులను భర్తీ చేయగలిగారు. అదీ సామాజిక న్యాయం కోణంలో మూడు పోస్టులను భర్తీ చేశారు. ఎస్సీ మాల సామాజికవర్గం నుంచి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎస్సీ మాదిగ సామాజికవర్గం నుంచి అడ్లూరి లక్ష్మణ్, బీసీ సామాజికవర్గానికి చెందిన వాకిటి శ్రీహరి మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ నెల 8వ తేదీన రాజ్ భవన్ లో ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రులు ప్రమాణ స్వీకారం చేసి నాలుగు రోజులవుతున్నప్పటికీ ఇప్పటి వరకూ మంత్రులకు శాఖలను కేటాయించలేదు.మంత్రులకు శాఖలకు కేటాయింపు విషయంలో కూడా ఢిల్లీ వైపు చూస్తే ఎలా? అని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మంత్రి వర్గంలో ఎవరిని తీసుకోవాలన్నది హైకమాండ్ నిర్ణయం తీసుకుంటే పరవాలేదు కానీ, శాఖల కేటాయింపులో కూడా పార్టీ అధినాయకత్వం జోక్యం ఏంటన్న ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదంటున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్నప్పుడు ప్రతి చిన్న అంశానికి ఢిల్లీపై ఆధారపడలేదన్న విషయాన్నిగుర్తు చేస్తున్నారు. హైకమాండ్ పెత్తనం ఇటీవల కాలంలో ఎక్కువయిందన్న కామెంట్స్ సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రికి కనీసం ఫ్రీ హ్యాండ్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని సెటైర్లు సోషల్ మీడియాలో కనపడుతున్నాయి.. మంత్రులకు శాఖలకు కేటాయింపు సహజంగా ముఖ్యమంత్రి విచక్షణాధికారానికి వదిలేయాలి. ఎవరు ఆ శాఖను సమర్థవంతంగా చేయగలరన్నది ముఖ్యమంత్రి నిర్ణయించుకుని ఆ శాఖలను కేటాయిస్తారు. కానీ శాఖల కేటాయింపు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల నుంచి ఢిల్లీలో పడిగాపులు కాయమేంటని విపక్షాలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, అవసరాలు ముఖ్యమంత్రికి వదిలేస్తే ఏదైనా నిర్ణయాలు తీసుకుంటారు. అంతే తప్పించి ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ వైపు చూడాలంటే ఎలా? అని కొందరు నెట్టింట ప్రశ్నిస్తున్నారు. మూడు రోజుల పాటు పాలనను పక్కన పెట్టి ముఖ్యమంత్రి ఢిల్లీలో ఉండటాన్ని తప్పు పడుతున్నారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను మంత్రులకు శాఖలకు కేటాయింపు కోసం కాదని చెబుతున్నప్పటికీ అది నమ్మశక్యంగా లేదు. మూడు రోజుల నుంచి ఢిల్లీలో ఉన్నది కులగణన కోసమంటే ఎవరు నమ్ముతారని, ఉత్తమ్, భట్టిని ఎందుకు పిలిచారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తే సోమవారం ఉదయంపది గంటల వరకూ ముఖ్యమంత్రి హైదరాబాద్ లోనే ఉన్నారు. మరి ఎందుకు శాఖలను కేటాయించలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రమాణ స్వీకారం చేసిన సాయంత్రానికే మంత్రులకు శాఖలను కేటాయించే వారని కొందరు గుర్తు చేస్తున్నారు. ప్రతి చిన్న విషయంలో ఢిల్లీ జోక్యం కూడా సరికాదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు.. కేంద్రం సంచలన ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 12, దేశవ్యాప్తంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపుల వినియోగం రోజురోగు పెరుగుతోంది. చిన్న కిరాణా దుకాణం నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు యూపీఐ ద్వారా లావాదేవీలు సర్వసాధారణమయ్యాయి. ప్రస్తుతం ఈ చెల్లింపులపై ఎటువంటి ఛార్జీలు లేనప్పటికీ, త్వరలో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీలను విధించేందుకు కేంద్రం యోచిస్తోందన్న వార్తలు ఆంగ్ల మీడియాలో వచ్చాయి. అయితే, ఈ వార్తలను కేంద్రం క్లారిటీ ఇచ్చింది.యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు విధించే ప్రతిపాదనలు పూర్తిగా ఊహాగానాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ ప్రచారం తప్పుదోవ పట్టించేలా ఉందని, పౌరుల్లో అనవసర ఆందోళనలకు కారణమవుతుందని ఎక్స్‌లో ఒక ప్రకటనలో తెలిపింది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించిందిఅధిక విలువైన యూపీఐ లావాదేవీల నిర్వహణకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు కొన్ని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో, రూ.3 వేలకు పైబడిన లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలను విధించేందుకు కేంద్రం చర్చలు జరుపుతోందని, బ్యాంకులు, ఎన్‌పీసీఐ, ఫిన్‌టెక్ సంస్థలతో సంప్రదింపుల తర్వాత ఒకటి లేదా రెండు నెలల్లో నిర్ణయం తీసుకోవచ్చని వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తలను కేంద్రం నిరాధారమైనవిగా కొట్టిపారేసింది.2022 వరకు యూపీఐ ఆధారిత చెల్లింపుల ప్రాసెసింగ్ కోసం వ్యాపారులు బ్యాంకులకు ఒక శాతం లోపు ఎండీఆర్ ఛార్జీలు చెల్లించేవారు. అయితే, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు కేంద్రం 2022లో ఈ ఛార్జీలను తొలగించింది. అప్పటి నుంచి ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలకు కేంద్రం సబ్సిడీలు అందిస్తోంది.ఒకవేళ ఎండీఆర్ ఛార్జీలు తిరిగి విధించినా, అవి వ్యాపారులపైనే ఉంటాయి, యూజర్లపై కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. యూపీఐ వినియోగదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరని స్పష్టమైంది. యూపీఐ లావాదేవీలపై ఛార్జీల విధానంపై వచ్చిన ఊహాగానాలను కేంద్రం ఖండించడంతో ఈ అంశంపై స్పష్టత వచ్చింది. డిజిటల్ చెల్లింపులను మరింత ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కషి చేస్తోందని, యూజర్లకు ఎటువంటి ఆర్థిక భారం ఉండబోదని నిర్ధారించింది.

## గజం రూ.2.98 లక్షలు, అమ్మో అన్ని కోట్లా..

హైదరాబాద్, జూన్ 12, హైదరాబాద్ ఐఖఊః హౌసింగ్‌బోర్డు స్థలాలను బుధవారం అధికారులు వేలం వేశారు. ఈ వేలంలో రికార్డు స్థాయిలో రూ.141.36 కోట్ల ఆదాయం సమకూరింది. పశ్చిమ డివిజన్ హౌసింగ్‌బోర్డు అధికారులు నిర్వహించిన ఈ వేలంలో 198 గజాల నుంచి 987 గజాల విస్తీర్ణం కలిగిన 18 ఇళ్ల స్థలాలను 87 మంది పోటీదారులు దక్కించుకున్నారు. మొత్తం 6,236.33 గజాల స్థలాలు విక్రయించబడ్డాయి. హౌసింగ్‌బోర్డు కమిషనర్ గౌతమ్ తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ–హైటెక్ సిటీ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలకు భారీ డిమాండ్ ఏర్పడింది.ముందుగా ఏడో ఫేజ్‌లోని నాలుగు వరుస స్థలాలకు కనీస ధర రూ.1.25 లక్షలు ఉండగా.. గజానికి రూ.2 లక్షలకు పైగా ధర పలికింది. మలుపులోని ఎంఐజీ ప్లాట్‌కు అత్యధికంగా గజానికి రూ.2.52 లక్షలు లభించింది. తర్వాత కనీస ధర రూ.1.50 లక్షలతో వేలం నిర్వహించిన స్థలాలకు అత్యధికంగా గజానికి రూ.2.98 లక్షలు, అత్యల్పంగా రూ.1.70 లక్షలు పలికాయి. కైతలాపూర్‌లో 36.16 గజాల విస్తీర్ణంలో ఉన్న స్థలాన్ని సైతం గజం రూ.1.14 లక్షలకు విక్రయించారు. ఈ స్థాయిలో డిమాండ్ రావటం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారి అని అధికారులు వెల్లడించారు. ఇది హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగానికి డిమాండ్ పెరుగుతున్నట్లు సూచిస్తుందని చెప్పారు.కాగా, ప్రభుత్వం నిర్వహించే వేలంలో స్థలాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. అందకు పలు కారణాలు ఉన్నాయని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములకు సాధారణంగా ఎలాంటి వివాదాలు ఉండవు. యాజమాన్య పత్రాలు స్పష్టంగా, పారదర్శకంగా ఉంటాయి. ప్రైవేట్ భూముల్లో తరచుగా కనిపించే కోర్టు కేసులు, ఎన్‌కంబరెన్స్‌లు వంటి సమస్యలు ప్రభుత్వ భూముల్లో తక్కువగా ఉంటాయి. ఇది కొనుగోలుదారులకు భద్రతా భావాన్ని కలిగిస్తుంది. ప్రభుత్వాలు సాధారణంగా ప్లాట్లను వేలం వేసే ముందు వాటి చుట్టూ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తాయి. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండే అవకాశం ఎక్కువ. కేపీహెచ్‌బీ–హైటెక్ సిటీ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న స్థలాలకు రికార్డు ధరలు పలకడానికి ఇదొక ప్రధాన కారణమని చెబుతున్నారు.

## భారీ వర్షాలకు పలు ప్రాంతాలు జలమయం

హైదరాబాద్,నగరంలో గురువారం తెల్లవారుజామున ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. లింగంపల్లి, చందానగర్, మియాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా చేరిన వరద నీరు తో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జి కింద చేరిన వరదనీటిలో రెండు కార్లు నిలిచిపోయాయి. లింగంపల్లి తారానగర్ లోని పోచమ్మ టెంపుల్ లోకి వరదనీరు చేరింది. ఇటీవలే లక్షల రూపాయలు ఖర్చు చేసి వరదనీరు చేరకుండా జీహెచ్ఎంసీ అధికారులు మరమ్మతులు చేసినా ఉపయోగం లేకుండా పోయింది... ఎప్పటిలాగే వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు.

# పట్టు చూపించేకొనే ప్రయత్నంలో నక్సల్స్

వరంగల్, జూన్ 12, ఆపరేషన్ కగార్' ప్రారంభమైనప్పటి నుంచి మావోయిస్టు పార్టీ మునుపెన్నడూ చూడలేనంత నష్టాన్ని చవి చూసింది. గత మూడు నెలల్లో పార్టీకి మూల స్తంభాలైన నాయకులను కోల్పోయింది. మావోయిస్టు క్యాడర్ చెల్లాచెదురైంది. చాలా మంది లొంగిపోయారు. మరికొందరు పోలీసులకు కోవర్టులుగా మారారు. పార్టీ ఉనికి ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో భద్రతా బలగాలపై కౌంటర్ ఎటాక్ చేస్తుందన్న వార్త నిజంగానే పలు అనుమానాలకు తావిస్తుంది. అయితే ఇది నిజమే. జనవరి నుం? జూన్ నెల వరకు ప్రతీ ఏటా మావోయిస్టు పార్టీ చేసే వ్యూహాత్మక దాడుల్లో భాగమే ఈ కౌంటర్ ఎటాక్ రోజులుగా ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు తూటాల వర్షం కురిపిస్తున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లలో ఏకంగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతి చెందారు. ఆయనతోపాటు మరో 27 మంది మావోయిస్టులు చనిపోయారు. అంతకు మునుపు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. మరో కేంద్ర కమిటీ సభ్యుడు, వైఎస్ హయాంలో శాంతి చర్చల్లో పాల్గొన్న నాయకుడు సుధాకర్ సైతం ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్ అలియాస్ మైలారపు అడెల్లు ఎన్‌కౌంటర్‌లోనే చనిపోయారు. పెద్ద ఎత్తున ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో మావోయిస్టులు పట్టు కోల్పోతున్నట్లు, భద్రతా బలగాలు పైచేయి సాధిస్తున్నట్లు అర్థమవుతుంది. అయితే, గత కొద్ది రోజులుగా జరుగుతున్న పోలీసు బలగాల దాడులకు ప్రతీకారంగా మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలోని కొంటా సమీపంలోని డోండ్రాలో పోలీసుల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఐఈడీలను పేల్చారు. ఈ ఘటనలో కొంటా డివిజన్ అదనపు ఎస్పీ ఆకాశ్ రావు తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఆయనతోపాటు డీఎస్పీ, సీఐలు సైతం గాయపడ్డారు. అయితే, మావోయిస్టుల ముఖ్యనేతల ఎన్‌కౌంటర్లకు ప్రతీకార దాడినా లేదా వ్యూహాత్మక దాడులా అన్న చర్చ ఇప్పుడు సాగుతోంది. కొద్ది రోజులుగా చాలా కీలక నేతలను మావోయిస్టు పార్టీ కోల్పోయింది. చాలా మంది పార్టీ సభ్యులు చనిపోయారు. కొందరు లొంగిపోయారు. ఈ తరుణంలో పార్టీ ఉనికి కాపాడుకోవడం కష్టమన్న వ్యాఖ్యలు వినిపించాయి. అయితే ఇలాంటి తరుణంలో దాడులు చేయడం మావోయిస్టు పార్టీ సిద్ధాంతంలో భాగమని చాలా తక్కువ మందికి తెలుసు. పార్టీ మనుగడకు ఇలాంటి సందర్భాల్లో ఎదురు దాడులు చేయడం అనేది ఆ పార్టీ వ్యూహంలోనూ, సిద్ధాంతంలోనూ ఉన్నాయి.మావోయిస్టు పార్టీ ఏకంగా తమ పార్టీ సుప్రీం లీడర్ నంబాల కేశవరావును కోల్పోయింది. ఇది ఆ పార్టీ క్యాడర్‌లోనూ, సానుభూతిపరుల్లోనూ తీవ్ర నిరాశ కలిగించే అంశం. భద్రతా బలగాలతో జరిపే పోరాటంలో కీలక ఆదేశాలు ఇచ్చే సుప్రీం కమాండర్‌ను ఆ పార్టీ కోల్పోతే, ఇంక ఎంత దారుణమైన పరిస్థితుల్లో ఆ క్యాడర్ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇలాంటి పరిస్థితులను ఊహించిన మావోయిస్టు పార్టీ ఇలాంటి సందర్భాల్లో దాడులు చేయడం ద్వారా పార్టీని బతికించుకోవచ్చన్న సిద్ధాంతాన్ని తయారు చేసుకుంది. ఇలాంటి సమయాల్లో చేసే దాడులు పార్టీ క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపుతాయి. వారి నైతిక స్థైర్యాన్ని పెంచి పోరాటం దిశగా నడిపిస్తాయని మావోయిస్టు పార్టీ నేతలు చెబుతారు. ఉద్యమాన్ని తిరిగి కొనసాగించడానికి, పార్టీ బలంగానే ఉందని సందేశం ఇవ్వడానికి ఈ దాడులు ఉపయోగపడతాయని చెబుతారు.పోలీసు బలగాలు చేసే దాడుల వల్ల తామేమీ బలహీనపడలేదన్న సందేశం ఇవ్వడానికి కూడా మావోయిస్టు పార్టీ ఇలాంటి ప్రతి దాడులను చేస్తుంది. భద్రతా దళాలు మావోయిస్టులను బలహీనపరిచాయని, ఇక ఆ పార్టీ బతికి బట్టకట్టడం కష్టమన్న ప్రచారం సాగుతున్న తరుణంలో తమ ఉనికిని దాడుల ద్వారా గట్టిగా చెప్పే ప్రయత్నం చేస్తుందని మాజీ మావోయిస్టు కీలక నేతలు చెబుతున్నారు. తమ పార్టీని అంత తేలికగా తీసిపారవేయవద్దనే సంకేతాన్ని ప్రభుత్వానికి, ప్రజలకు, అంతర్జాతీయ సమాజానికి ఇచ్చే సందేశాత్మక దాడులుగా చెప్పవచ్చు.మావోయిస్టు పార్టీలోని కీలక నాయకులు పోలీసు బలగాల చేతుల్లో చనిపోతే దానికి ప్రతీకారం తీర్చుకోవడం మావోయిస్టు పార్టీ సిద్ధాంతంలో ఓ భాగం. తమతోపాటు ఎన్నో కష్ట, నష్టాలకోర్చి, ప్రజల కోసం పని చేసే తమ సహచరులను కోల్పోయినందుకు వారికి నివాళిగా ఇలాంటి దాడులు చేసేందుకు మావోయిస్టులు సిద్ధపడతారు. ఈ దాడుల వల్ల పోలీసు బలగాలపైన ఒత్తిడి పెంచడం, తమ ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా దళాలు వ్యూహాత్మకంగా వెనకడుగు వేసేలా చేయడం ఇందులో ప్రధానమైన అంశాలు.తమను రూపుమాపేందుకు భద్రతా బలగాలు అమాయకులైన గిరిజనులను కూడా ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపుతున్నాయంటూ, అందుకే ఈ ప్రతీకార దాడులు చేస్తున్నట్లు మావోయిస్టు పార్టీ నేతలు చెబుతుంటారు. ఇది కేవలం తమ నేతలు మాత్రమే కాకుండా, అమాయకమైన అటవీ ప్రాంత ప్రజలను ప్రభుత్వం టార్గెట్ చేస్తుందని చెప్పడం, అందుకోసమే ఈ దాడులని ప్రచారం చేయడం ద్వారా ప్రజల మద్దతును, వారి సానుభూతిని ఆ పార్టీ పొందుతుంది. ఈ వ్యూహంతోనే సిద్ధాంతపరమైన దాడులకు ఆ పార్టీ వ్యూహ రచన చేస్తుంది.పార్టీకి ఎదురుదెబ్బలు తగిలినప్పుడు తమపై భద్రతా బలగాలు పైచేయి సాధించకుండా ఉండేందుకు ఇలాంటి ప్రతీకార దాడులకు మావోయిస్టు పార్టీ సిద్ధపడుతుంది. ఇలాంటి దాడులు పోలీసు బలగాలపై మానసికంగా ఒత్తిడి పెంచే ఉద్దేశంతో చేస్తుంటారు. పోలీసు బలగాలపై మెరుపు దాడులకు దిగడం, భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని మందుపాతరలు పేల్చడం వల్ల పోలీసు బలగాల కదలికలను నియంత్రిస్తారు. కూంబింగ్ ఆపరేషన్లను తాత్కాలికంగా నిలుపుదల చేసే వ్యూహంలో ఇది భాగం.పార్టీకి ఎదురుదెబ్బలు తగిలినా తమ విప్లవం, తమ సిద్ధాంతం సజీవమైనదని ప్రజలకు, మీడియా వర్గాలకు సందేశం ఇచ్చే ఉద్దేశంతో కూడా ఇలాంటి దాడులకు మావోయిస్టు పార్టీ సిద్ధపడుతుంది. తాము చేసే ప్రజా డిమాండ్లు చర్చకు పెట్టేందుకు కూడా ఇలాంటి దాడులు సహకరిస్తాయన్నది మావోయిస్టు నేతల నమ్మకం. పీపుల్స్ వార్ సిద్ధాంతం ప్రకారం విప్లవకారుడు దీర్ఘకాలిక ప్రజా యుద్ధం దిశగా నడవాలి. ఇలాంటి ప్రయాణంలో రాజ్యం నిర్బంధం ఎక్కువ చేసినా, విప్లవకారులను నిర్మూలించే వ్యూహంతో సాగినా సిద్ధాంతపరంగా ముందుకు సాగిపోవాలి, దీర్ఘకాలిక ప్రజా యుద్ధం కోసం సన్నద్ధులుగా ఉండాలి. ఇది వారి సైద్ధాంతిక వ్యూహం.

## రేవంత్ త్యాగాలకు సిద్ధపడుతున్నారా...

హైదరాబాద్, జూన్ 12, ముగ్గురు మంత్రులు ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో.. వారికి ఏ శాఖలు కేటాయిస్తారు అనేది ఆసక్తికరంగా మారింది. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక స్పష్టత ఇచ్చారు. ఆయన ఢిల్లీ టూర్లో కూడా ఇదే విషయాలపై మాట్లాడారు. తనను కలిసిన మీడియా ప్రతినిధులతో రేవంత్ రెడ్డి పలు అంశాలను వెల్లడించారు. కొత్తగా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారికి ఏ శాఖల కేటాయిస్తారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. దానికి రేవంత్ రెడ్డి సూటిగా సమాధానం చెప్పారు. సుత్తి లేకుండా అసలు విషయాన్నీ వెల్లడించారు. " సీనియర్ మంత్రుల శాఖలో ప్రస్తుతానికి మార్పులు లేవు.. వస్తున్నా వద్ద ఉన్న 11 శాఖలలో కొన్నింటిని కొత్త మంత్రులకు ఇస్తాను. నా వద్ద హోమ్, మున్సిపల్, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ వంటి కీలకమైన 11 విభాగాలు ఉన్నాయి.. వాటిలో కొన్నిటిని కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురికి ఇస్తాను.. అయితే ఇప్పటికే వారికి శాఖల కేటాయింపు జరిగిందని" రేవంత్ రెడ్డి స్పష్టత ఇచ్చారు.ముఖ్యమంత్రి వద్ద హోమ్ శాఖ, మున్సిపల్ శాఖ, విద్యాశాఖలు ఉన్నాయి. పని ఒత్తిడి వల్ల ఈ మూడు శాఖలను ఆయన ముగ్గురు మంత్రులకు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే అధిష్టానం భట్టి విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డికి వర్తమానం పంపించి.. హస్తినకు పిలిపించుకుంది. వారితో చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ఫలితంగా శాఖలను వారికి ఇచ్చే విషయంలో అధిష్టానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి దగ్గర ఉన్న 11 శాఖల్లో కీలకమైన మూడింటిని కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు ఇస్తారని తెలుస్తోంది.." ముఖ్యమంత్రి దగ్గర 11 శాఖలు ఉన్నాయి. అందులో కీలకమైన శాఖలను ముగ్గురు మంత్రులకు ఇవ్వడానికి అధిష్టానం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇదే పూర్తయితే కనుక ఆ శాఖలకు పూర్తిస్థాయిలో మంత్రులు వస్తారు. ఇప్పటికే ఆ శాఖలలో జరుగుతున్న వ్యవహారాల వల్ల ప్రభుత్వానికి ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతోంది. ఆ శాఖలకు మంత్రులు గనుక వస్తే పెద్దగా ఇబ్బంది ఉండదు..ఆశాఖలకు గత బడ్జెట్లో ప్రభుత్వం కేటాయింపులు భారీగానే జరిపింది కాబట్టి.. అభివృద్ధి కార్యక్రమాలు జరపడానికి ఆస్కారం ఉంటుందని" కాంగ్రెస్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే రేవంత్ రెడ్డి తీసుకున్న సంచలన వల్లే ముగ్గురు మంత్రులకు శాఖలు వచ్చాయని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే మలిదశలో మంత్రివర్గ విస్తరణ ఉన్న నేపథ్యంలో వారికి ఎటువంటి శాఖలు కేటాయిస్తారు.. అందులో ఎంతమంది సీనియర్ నాయకులకు స్థానం కల్పిస్తారు అనేది ఆసక్తికరంగా మారింది.

## ఇందిరమ్మ ఇల్లు పనులు వెంటనే ప్రారంభించాలి

సిద్దిపేట జూన్ 12, హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు సింగపాక మల్లవ్వ ఇంటి నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ భూమిపూజ చేసారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు తనకు మంజూరు అయినందుకు సింగపాక మల్లవ్వ ఆనందంతో కంటతడి పెట్టింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం లో ప్రతి నియోజకవర్గం కు 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక స్తోమత లేని వారికి మహిళా సంఘాల నుండి లక్ష రూపాయల రుణం అందజేయడం జరుగుతుంది. ప్రతి ఇందిరమ్మ ఇళ్లకు 8 ట్రాక్టర్ల ఇసుక ఉచితంగా ఇవ్వబడుతుంది. ప్రతి ఒక్కరు ఇందిరమ్మ ఇల్లు పనులు వెంట వెంటనే ప్రారంభించాలి. ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంది. గ్రామంలో ఉన్న పెద్దలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వారికి సహకరించాలి ఇల్లు కట్టి చూడు పెళ్లి చేసి చూడు అంటారు అందరూ ఇల్లు పూర్తి చేసుకోవాలి. 10 ఏళ్లలో డబుల్ బెడ్ రూంల కోసం ఎదురు చూశారు. నియోజకవర్గం మొత్తం 400 డబుల్ బెడ్ రూంలు కూడా ఇవ్వలేదని అన్నారు.

## ఎకరాకు 4 కోట్లు ఇవ్వాల్సిందే

వరంగల్, జూన్ 12, హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ వద్ద నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి పనులను బుధవారం భూనిర్వాసితులు అడ్డుకున్నారు. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తేనే తమ భూములను రహదారి నిర్మాణానికి ఇస్తామని రైతులు స్పష్టం చేశారు. నష్టపరిహారంపై స్పష్టత వచ్చే వరకు తమ భూముల్లోకి అడుగుపెట్టవద్దంటూ అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. పరకాల ఆర్డీవో నారాయణ, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. రైతులు వినకపోవడంతో పోలీసు బందోబస్తు మధ్య పనులు కొనసాగించారు.పనులు జరుగుతుండగా ఎక్స్‌కవేటర్లకు అడ్డుగా వచ్చిన రైతులను పోలీసులు అదుపులోకి తీసుకుని, అనంతరం వదిలేశారు. కోర్టు నుంచి స్టే ఉన్నప్పటికీ అధికారులు పనులను పట్టించుకోకుండా చేపడుతున్నారని నిర్వాసితులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సంవత్సరానికి రెండు పంటలు పండే సారవంతమైన భూముల మధ్య నుంచి రహదారి వెళ్తుంటే, తమ వ్యవసాయం, జీవనాధారం ఎలా? అని ప్రశ్నించారు. ఎకరాకు రూ.4 కోట్లు చెల్లిస్తేనే తమ భూములిస్తామని, లేదంటే న్యాయపోరాటం చేస్తామని నిర్వాసితులు తేల్చి చెప్పారు.నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ నిర్మిస్తున్నారు. ఈ ఎక్స్‌ప్రెస్ వే మొత్తం పొడవు సుమారు 405 కిలోమీటర్లు. ప్రస్తుతం నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ హైవే కాగా.. భవిష్యత్తులో ఆరు లేన్లకు విస్తరించే అవకాశం ఉంది. సుమారు రూ. 14,000 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్, వర్ధా, చంద్రపూర్ జిల్లాల మీదుగా తెలంగాణలోని అసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం మీదుగా దాదాపు 306 కి.మీ మేర నిర్మిస్తున్నారు. ఖమ్మం నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి వరకు నిర్మిస్తున్నారు.భూసేకరణ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ సాగుతోంది. తెలంగాణలో భూనిర్వాసితులు నష్టపరిహారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో ఎకరాకు రూ. 20 లక్షల నుంచి రూ. 27 లక్షల దాకా నష్టపరిహారం ఇచ్చేందుకు ఔఊంఎ అంగీకరించింది. హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ వంటి ప్రాంతాల్లో రైతులు ఎకరాకు రూ.4 కోట్లు డిమాండ్ చేస్తూ రైతులు పనులను అడ్డుకుంటున్నారు. కోర్టు స్టే ఉన్నప్పటికీ పనులు చేపట్టారని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు.

## బీఆర్ఎస్ నేతలు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారు

### ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

హైదరాబాద్ జూన్ 12, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.. సీఎం పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేటీఆర్ ముఖ్యమంత్రి కుర్చీని గౌరవించాలని మాట్లాడాడు మరి ఇప్పుడు ఆయన బుద్ధి ఏమైందని అన్నారు.కేటీఆర్ వ్యాఖ్యలు బీఆర్ఎస్ కాంగ్రెస్ శ్రేణులు కొట్లాడుకునే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో లాండ్ ఆర్డర్ కు విఘాతం కలిగించే విధంగా కేటీఆర్ వ్యాఖ్యలు చేస్తున్నాడు. కింది స్థాయిలో ఉన్న బీఆర్ఎస్ ౹ా కార్యకర్తలు.. కాంగ్రెస్ కార్యకర్తలు కొట్టుకొని శాంతి భద్రతలకు భంగం కలిగించాలని చూస్తున్నారు. ఆ విషయంపై చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు.బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన అఫీషియల్ సోషల్ మీడియా హ్యాండిల్ లో ఇలాంటి వ్యాఖ్యలు పోస్ట్ చేశాడు. కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారాలపై అసెంబ్లీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తాం. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలందరికీ సీఎం.సీఎంపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ౹ా నాయకులు సోషల్ మీడియాలో ఇలాంటి వ్యక్తిగత అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై నియంత్రణ చేయకుంటే.. మేం కూడా మీరు చేసిన స్కాములు అరాచకాలపై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని అన్నారు.

## బకాయిలు చెల్లించనందుకు గురుకుల పాఠశాలకు తాళాలు


హైదరాబాద్,వేసవి సెలవుల తరువాత విద్యాసంస్థల ప్రారంభమైన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు బడి గంట మోగగా మైనార్టీ గురుకుల (రెసిడెన్షియల్) పాఠశాలల గంట మాత్రం మోగకపోవడంతో సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. హైదరాబాదులో గురుకుల పాఠశాలలు ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయ. ఆయా పాఠశాలలకు సకాలంలో అద్దెలు చెల్లించని కారణంగా విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజే పాఠశాల భవన యాజమాన్యాలు మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలకు తాళాలు వేశారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ బాలికల పాఠశాల భవనానికి భవన యజమాని తాళం వేశారు. నగరంలోని ఇతర మైనారిటీ గురుకుల పాఠశాలలకు కూడా వేసినట్టు పుకార్లు షికారు చేస్తున్నాయి. మైనార్టీ గురుకుల పాఠశాలల తెరవకపోవడంతో ఎస్ ఎఫ్ ఐ, డి వై ఎఫ్ ఐ ప్రతినిధులు పాఠశాల వద్దకు వచ్చి పాఠశాలలు తెరిపించాలని కోరారు. . రాష్ట్రంలోని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలకు మాత్రం అర్ధరాత్రి 9 నెలల అద్దె చెల్లించారని ప్రస్తుతం 13 నెలలుగా తమ భవనాలకు అద్దె " చెల్లించకపోవడంతో తాము ఏ విధంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులు తెలియచేయాలని భవన యజమానులు పేర్కొన్నారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో దాదాపు 375 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యాని అభ్యసిస్తున్నారని వారి జీవితం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం లేకపోలేదని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జావిద్ ఆరోపించారు.

## రేణుక ను కంట్రోల్ చేయకపోతే కాంగ్రెస్ కే నష్టమా?



ఖమ్మం, జూన్ 12,రేణుకా చౌదరి సీనియర్ రాజకీయ నాయకురాలు. తెలుగుదేశం పార్టీ నుంచి ఎదిగిన ఆమె కొన్నిదశాబ్దాల నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. అయితే ఆమె చేస్తున్న వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ లో జగన్ కు అనుకూలంగా ఆమె చేస్తున్న వ్యాఖ్యలు మారుతున్నాయి. రేణుకా చౌదరి అవుట్ డేటెడ్ రాజకీయ నాయకురాలు. ఆమె ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో ఫైర్ బ్రాండ్. అది కొన్ని దశాబ్దాల క్రితం. అయితే రోజులు గడిచే కొద్దీ ఆమె ఏం మాట్లాడాలో? ఏం మాట్లాడకూడదో తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. గాంధీ కుటుంబంతో ఉన్న సత్సంబంధాల కారణంగా రేణుక చౌదరి రాజ్యసభ పదవికి ఎంపికయ్యారు కానీ, లేకుంటే ఆమె రాజకీయ సన్యాసం ఎప్పుడో చేయాల్సి వచ్చేది. రేణుకా చౌదరి తానే మోనార్క్ అని భావించే వ్యక్తి. పాతకాలం నాటి రాజకీయాలు కాదు. ఖమ్మం జిల్లాలో ఆమె కాలుమోపడానికి వీలులేని పరిస్థితులున్నాయి. అక్కడ కొత్తగా ఎదిగిన నేతలు రేణుకా చౌదరిని అడుగడుగునా అడ్డుకుంటున్నారు. మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి వంటి నేతలుండగా ఖమ్మంలో రాజకీయం చేయలేని పరిస్థితులు రేణుకా చౌదరికి ఉన్నాయి. అయితే ఆమె తరచూ ఏదో ఒక వివాదంలో ఉంటూ తాను యాక్టివ్ గానే ఉన్నాననేందుకు ప్రయత్నిస్తుంటారు. రాజ్యసభ పదవిగా ఎంపికయిన తర్వాత రేణుకా చౌదరి ఖమ్మంలో పర్యటించింది కూడా చాలా తక్కువ అనే చెప్పాలి. ఆమె వర్గాలను ప్రోత్సహిస్తుందని, పార్టీకి ఇబ్బందులు కలిగిస్తుందని సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాజకీయాలు చేస్తూ తరచూ రేణుకా చౌదరి ఆంధ్రప్రదేశ్ పాలిటిక్స్ లోనూ వేలు పెడుతుంటారు. అది అనవసర జోక్యం అని ఆమెకు తెలుసు. జగన్ పై చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే తెలంగాణలో కాంగ్రెస్ కు అండగా ఉన్న రెడ్డి సామాజికవర్గం ఓటర్లు ఆమెపై ఆగ్రహంతో ఉన్నారు. రేణుకా చౌదరి ఏపీ మాజీ సీఎం జగన్ పై వ్యాఖ్యలు చేసినప్పటికీ ఆ మాటల ఎఫెక్ట్ తెలంగాణ కాంగ్రెస్ పై పడే అవకాశముంది. రేణుకా చౌదరి మాట్లాడిన మాటలు కేవలం జగన్ కు వ్యక్తిగతంగానే కాదు ఏపీలోనూ వైసీపీకి కొంత లాభం చేకూర్చేవిగా ఉన్నాయి. టీడీపీకి సాయం చేయాలన్న ఆలోచనతో ఆమె చేస్తున్న కామెంట్స్ చివరకు చేటు తెచ్చే విధంగా తయారవుతున్నాయని, మొన్నటి ఎన్నికల్లో దూరమైన వర్గాలను కూడా రేణుకా చౌదరి తన మాటలతో జగన్ కు దగ్గర చేస్తున్నారన్న విశ్లేషణలు అయితే బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రేణుకా చౌదరిని కాంగ్రెస్ నాయకత్వం కట్టడి చేయకపోతే పార్టీ తెలంగాణలో నష్టపోయే అవకాశముందని కొందరు కాంగ్రెస్ నేతలు హైకమాండ్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

## కవితక్కను సైడ్ చేసేస్తారా...



హైదరాబాద్, జూన్ 12, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను పార్టీలో ఎవరూ దరి చేరనివ్వడం లేదు. ఆమెను ఒంటరి చేసినట్లే కనపడుతుంది. ఈ నెల 4వ తేదీన ఇందిరాపార్కువద్ద మహా ధర్నా చేశారు. అదీ కూడా కేసీఆర్ కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇచ్చిందని ఆమె ధర్నాకు దిగారు. తెలంగాణ జాగృతి తరుపున కల్వకుంట్ల కవిత ధర్నాకు దిగారు. అంత వరకూ ఓకే. గతంలో కవిత ఏ కార్యక్రమం చేసినా బీఆర్ఎస్ లోని ముఖ్యమైన నేతలందరూ హాజరయ్యేవారు. తెలంగాణ ఉద్యమం నాటి నుంచి మొన్నటి వరకూ కవిత జాగృతి తరుపున తలపెట్టిన కార్యక్రమానికి నేతలందరూ హాజరై ఆమెకు అండగా నిలిచేవారు. కాని కట్ చేస్తే.. ఇప్పుడు సీన్ మారింది. కల్వకుంట్ల కవిత తన తండ్రి కేసీఆర్ కు ఘాటుగా లేఖ రాయడం, బీజేపీలో బీఆర్ఎస్ ను విలీనం చేస్తున్నారని ఆఫ్ ది రికార్డులో అన్న మాటలతో నాయకత్వం కూడా ఆమెకు దూరమయింది... కల్వకుంట్ల కవిత కూడా తాను ఒంటరిగానే ప్రయాణం చేసేందుకు సిద్ధమయినట్లు కనపడుతుంది. తెలంగాణ జాగృతి సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు తనకు కేసీఆర్ ఒక్కరే నాయకుడని చెప్పడం, జాగృతి తరుపున అనుబంధ సంస్థలను ఏర్పాటు చేసుకుంటూ వెళుతుండటం కొంత ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా తన సోదరుడు కేటీఆర్ పై ఆమె పరోక్షంగా చేసిన వ్యాఖ్యలతో కుటుంబానికి కూడా ఆమె దూరమయినట్లే కనిపిస్తుంది. ఆమె తన సోదరుడికి దూరం కావాలనే ఈ కామెంట్స్ చేశారు. దీంతో తెలంగాణజాగృతి నిర్వహించే కార్యక్రమానికి బీఆర్ఎస్ నేతలు ఎవరూ హాజరు కావద్దంటూ అధినాయకత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చాయట. అటు వైపు రాకుండా... అందుకే కవిత ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు బీఆర్ఎస్ నేతలు ఎవరూ అటు వైపు చూడలేదు. బీఆర్ఎస్ లో ఉన్న మహిళా నాయకులు, మాజీ మంత్రులు కూడా రాకపోవడంతో కారు పార్టీ నేతలు కవితకు దూరంగానే ఉండాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉండటంతో పాటు కేసీఆర్ ఆదేశాలతోనే కవిత కార్యక్రమానికి నేతలు ఎవరూ హాజరు కాలేదని తెలిసింది. దీన్ని బట్టి చూస్తుంటే కవితకు కారు పార్టీ నుంచి సహకారం ఇక భవిష్యత్ లోనూ అందే అవకాశాలు కనిపించడం లేదు.

# ఏడాదిలో ఎంతో పరిణితి

విజయవాడ, జూన్ 12 నారా లోకేష్ అంటే ఒక వ్యక్తి కాదు.. శక్తి అంటున్నారు రాజకీయ ప్రత్యర్థులు. మొన్నటి వరకు రాజకీయాల తెలియవు.. సమర్థుడు కాదు అంటూ ముద్ర వేసే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు ఏం రాజకీయాలు చేస్తున్నారు రా అంటూ ప్రత్యర్థుల సైతం ఆశ్చర్యపోయేలా చేస్తున్నారు నారా లోకేష్.ఏపీ భవిష్యత్తుతో ముడిపడిన నాయకుడు నారా లోకేష్. ఇంతింతై వటుడింతై అన్నట్టు నారా లోకేష్ తనను తాను ఆవిష్కరించుకున్నారు. ఇబ్బందులతోపాటు చిక్కుముళ్లను అధిగమించి భావి నాయకుడిగా ఏపీ రాజకీయాల్లో తనదైన ముద్ర చాటుకున్నారు. నియంతృత్వాన్ని, నిర్బంధాలను దాటుకొని తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. రాష్ట్ర మంత్రిగా, తెలుగుదేశం పార్టీని నడిపించే సైనికుడిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. టిడిపిని నడిపించే భావి నాయకుడిగా పార్టీలో ఆత్మవిశ్వాసం పెంపొందించుకొంటున్నారు. ప్రభుత్వంలో సైతం కీలక పాత్ర పోషిస్తూ.. ప్రజలకు సుపరిపాలన అందిస్తూ.. నిజమైన నాయకుడు ఇలా ఉండాలి అనే మాదిరిగా ప్రత్యర్థుల నుంచి సైతం అభినందనలు అందుకుంటున్న నేత నారా లోకేష్ అంటే ఒక వ్యక్తి కాదు.. శక్తి అంటున్నారు రాజకీయ ప్రత్యర్థులు. మొన్నటి వరకు రాజకీయాలు తెలియవు.. సమర్థుడు కాదు అంటూ ముద్ర వేసే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు ఏం రాజకీయాలు చేస్తున్నారు రా అంటూ ప్రత్యర్థుల సైతం ఆశ్చర్యపోయేలా చేస్తున్నారు నారా లోకేష్. ప్రస్తుతం రెడ్ బుక్ క్రియేటర్ గా ప్రతిపక్ష పార్టీలకు బ్రాండ్ అంబాసిడర్ గా మారిపోయారు లోకేష్. లోకేష్ 1.0 ఒక ఎత్తు.. 2.0 అన్నది మరో ఎత్తు అన్నట్టు విశ్వరూపం చూపిస్తున్నారు. ఈ రోజున ఆయన పార్టీలో ప్రభుత్వంలో తనదైన ముద్ర వేసుకున్నారు. తండ్రి చంద్రబాబును అనుసరిస్తూనే పొలిటిక్స్ లో తనకంటూ ఒక కొత్త వరవడిని సృష్టించుకున్నారు. తండ్రి ఐటి అంటే కుమారుడు వాట్సాప్ గవర్నెన్స్ ని తెచ్చారు. ఎన్నో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుడుతున్నారు.నారా లోకేష్ ను నిశితంగా పరిశీలిస్తే ఆయన మెచ్యూరిటీ లెవెల్స్ గణనీయంగా పెరిగాయి అని ఒప్పుకోక తప్పని పరిస్థితి. ఆయన ప్రభుత్వ మంత్రిత్వ శాఖల పట్ల పూర్తి అవగాహనతో ఉన్నారు. లోకేష్ ప్రసంగాలు కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. అందుకే తెలుగుదేశంలో భావి నాయకుడిగా లోకేష్ కీర్తించబడుతున్నారు. లోకేష్ ఇంటా గెలిచారు.. రచ్చ కూడా గెలుస్తున్నారు. అటు బిజెపి అగ్రనాయకత్వం సైతం లోకేష్ విషయంలో సానుకూలత ప్రదర్శిస్తోంది. ఏ నోటితో అయితే లోకేష్ వారసత్వ రాజకీయం పై మాట్లాడారో.. అదే నరేంద్ర మోడీ ప్రత్యేకంగా విందుకు పిలిచారంటే లోకేష్ పరిమితి ఏ స్థాయిలో పెరిగిందో గుర్తుచేసుకోవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే లోకేష్ టిడిపి భావి నాయకుడు. అందులో ఎంతవరకు అనుమానం లేదు. కానీ ఆయన కూటమిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న తీరు మాత్రం అభినందనలు అందుకుంటుంది.

# ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అసిస్టెంట్ ప్రొఫెసర్ (వైద్యులు) జీతాలు పెంచాలి

### విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ డిమాండ్

విశాఖపట్నం,విశాఖ వైద్య విజ్ఞాన సంస్థలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న వైద్యులకు జీతాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారువిశాఖపట్నం విమ్స్ హాస్పిటల్ లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు తమ మౌన నిరసన తెలియజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధుల్లో చేరి మూడేళ్లు దాటిన 92,000 జీతానికే విధులు నిర్వహిస్తున్నామని, కాంట్రాక్టర్ పద్ధతిలో ఆంధ్రప్రదేశ్లో పలాస కిడ్నీ హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు దాదాపు లక్ష 60,000 ఇస్తున్నారని అదే క్యాడర్ కు చెందిన తమకు మాత్రం 92000 ప్రభుత్వం ఇస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక పీజీ స్టూడెంట్స్ టైఫండ్ మాకంటే ఎక్కువ వస్తుంది అని అన్నారు మూడేళ్లు దాటినప్పటికీ రెన్యువల్ చేయలేదని భవిష్యత్తులో పెంచిన జీతాలతో కాంట్రాక్టు రెన్యూ చేయాలని విమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కోరారు కోరారు. అయితే కేవలం ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు మాత్రమే రెండు గంటల పాటు నిరసన వ్యక్తం చేస్తున్నామని 11 గంటలకు యధావిధిగా విధులు నిర్వహిస్తామని తెలియజేశారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మా ఆవేదనను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వైద్యశాఖ మంత్రులు అర్థం చేసుకొని తమకు న్యాయం చేస్తారని ప్రభుత్వాన్ని కోరినట్లు విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ వైద్యులు తెలిపారు.

# సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం...

చాగలమర్రిమండల కేంద్రమైన చాగలమర్రి లోని అంగన్వాడి కేంద్రాలలో గురువారం అంగన్వాడి టీచర్లు చిన్నపిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం వేద పండితులసమక్షంలో వేదమంత్రాల మధ్య చేయించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆళ్లగడ్డ ప్రాజెక్ట్ సిడిపిఓ తేజస్విని, మండల సూపర్వైజర్ సుశీల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంగన్వాడి పిలుస్తోంది అనే కార్యక్రమం ద్వారా అంగన్వాడి బడి ఈడు పిల్లలను అంగన్వాడి రికార్డులలో నమోదు చేసుకుంటున్నామన్నారు. ఇంటింటా వెళ్లి అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులను చేర్పించాలని అవగాహన కల్పిస్తున్నామన్నారు. పూర్వ ప్రాథమిక విద్యనుంచే ఉన్నత శిఖరాలను అధిరోహించుటకు అంగన్వాడి కేంద్రాలే పునాదులు అన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, అంగన్వాడి కేంద్రాలలో వైద్య సేవలతో పాటు టీకాలు వేయించడం జరుగుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాల నుంచి ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని కూడా సకాలంలో పొందాలన్నారు. మాత శిశు సంరక్షణ ఐసిడిఎస్ లక్ష్యం అని వారు తెలిపారు.

# కమలం క్యాడర్ లో నిరుత్సాహం

### నమ్ముకున్న వాళ్లకు రాని పదవులు

విజయవాడ, జూన్ 12, ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు పురంద్రీశ్వరిపై వత్తిడి పెరుగుతున్నట్లుంది. ఒకవైపు కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ బీజేపీ నేతలకు అన్యాయం చేస్తుందన్నది పార్టీలో అందరి నోటా వినిపిస్తున్న మాట. కేంద్ర నాయకత్వంపైనా, ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబుపైన వత్తిడి తెచ్చి ఎక్కువ పదవులను రాబట్టుకునేలా ప్రయత్నించడంలో పురంద్రీశ్వరి విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పురంద్రీశ్వరి పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలను చేపట్టిన తర్వాత మొన్నటి ఎన్నికల్లోనూ తక్కువ స్థానాలను పొత్తులో భాగంగా తీసుకున్నారని, అదే సమయంలో నామినేటెడ్ పదవుల విషయంలోనూ అన్యాయం చేస్తున్నా పెదవి విప్పడం లేదని కొందరు నేతలు అంటున్నారు. బీజేపీకి కేటాయించిన నాలుగైదు పోస్టుల్లోనూ తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చి బీజేపీలో చేరిన వాళ్లకు మాత్రమే నామినేటెడ్ పదవులు దక్కుతున్నాయని, బీజేపీలో తొలి నుంచి ఉన్నవారికి, పార్టీలో సుదీర్ఘకాలం నుంచి పనిచేస్తున్న వారికి పదవులు ఇప్పించుకోవడంలో చిన్నమ్మ ఫెయిల్ అయ్యారని సొంత పార్టీ నేతలేఅంటున్నారు. సామాజికవర్గం కోణంలో కూడా పదవుల పంపిణీ బీజేపీకి కేటాయించిన విషయంలో జరగలేదని అంటున్నారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవుల విషయంలో కేంద్రపార్టీ నాయకత్వం తొలి నుంచి పార్టీలో ఉన్నవారికి పదవులు ఇస్తుంటే, నామినేటెడ్ పదవులు మాత్రం ఇతరపార్టీల నుంచి వచ్చిన వారికి ఇవ్వడమేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తన ప్రమేయం ఏమీ లేదని... పురంద్రీశ్వరి అయితే నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలోనూ తన ప్రమేయం ఏమీ లేదని చెబుతున్నారు. కేవలం కేంద్ర నాయకత్వం సూచనల మేరకే అన్ని పదవుల భర్తీ జరుగుతుందని చెబుతున్నారు. పురంద్రీశ్వరి రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలిగా ఉన్నప్పటికీ తన ప్రమేయం లేకుండానే నేరుగా టీడీపీ నాయకత్వం కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి పదవులను భర్తీ చేస్తున్నారని అంటున్నారు. బీజేపీ నాయకులు మాత్రం తమకు పదవులు దక్కకపోవడానికి కారణం పురంద్రీశ్వరిమెతకవైఖరి అని చెబుతున్నారు. పట్టుబట్టే నైజం లేకపోవడం వల్లనే చాలా పదవులు తమకు రాకుండా కోల్పోవాల్సి వస్తుందని, ఇకనైనా త్వరలో బర్తీ కానున్న పోస్టుల్లో బీజేపీ నేతలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని చిన్నమ్మపై వత్తిడి తెచ్చేందుకు కొందరు నేతలు సిద్ధమవుతున్నారు.

# 16 గజాల్లో 3 అంతస్తులా..కూల్చేయండి

ఏలూరు, జూన్ 12, 16 గజాల స్థలంలో మూడంతస్తుల భవనం నిర్మిస్తుండటం పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరులో చర్చనీయాంశమైంది. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సీసీ రోడ్డు ప్రారంభోత్సవానికి వెళ్లినప్పుడు ఈ నిర్మాణం చూసి ఆశ్చర్యపోయారు. అనుమతులు లేకుండా కడుతున్నారని తెలుసుకుని వెంటనే కూల్చివేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. తక్కువ స్థలంలో ఇంత పెద్ద నిర్మాణం ఎంతవరకు సురక్షితమని ప్రజలు అనుకుంటున్నారు. 16 గజాల స్థలంలో మూడు అంతస్తుల భవనం కట్టడం సాధ్యమా.. నో డౌట్ అసాధ్యమనే సమాధానం వస్తుంది. కానీ ఓ వ్యక్తి మాత్రం 16 గజాల స్థలంలో మూడంస్తుల భవనాన్ని నిర్మించాడు. ఏం జరిగిందని ఆరా తీస్తే ఆసక్తికర విషయాలు తెలిశాయి.. ఈ భవనం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న పశ్చిమగోదావర జిల్లా ఉండి నియోజకవర్గంలో నిర్మించడం విశేషం. పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరులో 16 గజాల స్థలంలో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు.. దీనిని చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సీసీ రోడ్డు ప్రారంభోత్సవానికి ఆ ప్రాంతానికి వెళ్లారు.. ఈ భవనాన్ని చూసి షాకయ్యారు. అనుమతులు లేకుండా కడుతున్నారని తెలుసుకుని పంచాయతీ కార్యదర్శిని వెంటనే కూల్చివేయాలని ఆదేశించారు.పాలకోడేరు మంగయ్య చెరువు సమీపంలో చిన్న స్థలంలో ఈ భవనం కడుతుండటం చర్చనీయాంశమైంది. రోడ్డు పక్కన స్థలం ఉండటంతో చాలామంది ఆసక్తిగా చూస్తున్నారు. ఈ క్రమంలోనే రఘురామ కంటపడింది. స్థానికులు అనుమతులు తీసుకోలేదని చెప్పడంతో డిప్యూటీ స్పీకర్ సీరియస్ అయ్యారు. పంచాయతీ కార్యదర్శిని పిలిచి.. ఆ భవనాన్ని అనుమతి లేకుండా నిర్మిస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.. ఆ భవనాన్ని కూల్చివేయాలని ఆదేశించారు. దీంతో ఈ భవనం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అంత తక్కువ స్థలంలో మూడు అంతస్తులు నిర్మించడం అంత సేఫ్ కాదంటున్నారు.హైదరాబాద్లో కూడా ఓ వ్యక్తి 8 గజాల్లో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించి అందరికి షాకిచ్చాడు. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలం కుంట్లూరులో ఒక వ్యక్తి తన స్థలాన్ని ప్లాట్లుగా అమ్మారు. అందులో 8.8 గజాల స్థలం మిగిలింది.

# వన్ ఇయర్ లో ఏం చేశారంటే...

విజయవాడ, జూన్ 12, ఏపీలో కూటమి అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ఫోకస్ పెట్టింది.. రాజధాని అమరావతి, పోలవరం, రోడ్లకు మరమ్మతులతో పాటుగా సూపర్ సిక్స్లో భాగంగా వరుసగా పథకాలను అమలు చేస్తోంది. పింఛన్ డబ్బుల్ని రూ.4వేలకు పెంచారు.. డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి నిర్ణయాలు తీసుకున్నారు. పంచాయతీలకు నిధులు, గ్రామాల్లో రోడ్లు, రైతులకు సాయం, ఉద్యోగాల భర్తీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. రాజధాని అమరావతి పనులు మళ్లీ మొదలయ్యాయి.. పోలవరం ప్రాజెక్టుకు మళ్లీ పనులు మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి రూ.990 కోట్ల నిధులు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే 4 వేల కిలోమీటర్ల రోడ్లు వేసింది.కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 13,218 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 20 వేలకు పైగా గ్రామీణ పేదలకు మినీ గోకులాలు నిర్మించారు. పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో 20 వేల నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. అనకాపల్లి జిల్లాలో రూ.1.85 లక్షల కోట్లతో ఔఖఅ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు, శ్రీసిటీలో రూ.5 వేల కోట్లతో ఒఉ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ, రూ.65 వేల కోట్లతో రిలయన్స్ కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంటు, అనకాపల్లిలో రూ.1.35 లక్షల కోట్లతో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రామాయపట్నంలో రూ.96,862 కోట్లతో ః అఖఒ రిఫైనరీ, రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఓూఓఇ పార్కులు ఏర్పాటు దిశగా అడుగులుపడుతున్నాయి. ఇలా భారీగా పెట్టుబడులు వచ్చాయి.ఎన్డీఏలో టీడీపీ ముఖ్యమైన భాగస్వామిగా ఉండటంతో కేంద్రం రాష్ట్రానికి సహాయం చేస్తోంది. చంద్రబాబు నాయుడు ఈ అవకాశాన్ని రాష్ట్ర అభివృద్ధి కోసం పూర్తిగా ఉపయోగించుకుంటున్నారు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్ కు రూ.11,400 కోట్లు సాధించారు. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలకు కేంద్రం రూ.5 వేల కోట్లు ఇచ్చింది.విశాఖకు రైల్వే జోన్ మంజూరు చేయడంతో పాటు నిర్మాణ పనులు మొదలయ్యేలా చూసింది. రూ.72 వేల కోట్ల హైవే ప్రాజెక్టులు, రూ.70 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టు పనులకు కేంద్రం అనుమతి ఇచ్చింది. రూ.2245 కోట్లతో అమరావతికి 57 కిలోమీటర్ల రైల్వే లైన్ మంజూరు చేసింది.మిగిలిన పథకాల విషయానికి వస్తే.. దీపం-2 కింద 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తోంది. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవో రద్దు చేశారు.. మత్స్యకారుల సేవ పథకం ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లు ప్రారంభించారు.. 21 ప్రధాన దేవాలయాల్లో నిత్య అన్నదాన పథకాన్ని తీసుకొచ్చారు. ఈ నెలలోనే "అన్నదాత సుఖీభవ" పథకాన్ని కూడా అమలు చేయనున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చారు. ఇవాళ "తల్లికి వందనం" నిధులు

తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలులోకి రానుంది. అంతేకాదు చిష్ట్రజీబిబంజూజూ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా 350 రకాల సేవలు అందిస్తున్నారు. దేవాలయాల్లో నాయి బ్రాహ్మణుల వేతనాలను రూ.25 వేలకు పెంపు.. చేనేతలకు ఊూ ఎత్తివేశారు, పవర్ లూమ్స్ కు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్ కు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయించారు.. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు.వీటితో పాటుగా టీచర్లకు మేలు చేసేలా 117 జీవో రద్దు చేయడంతో పాటు యాప్ ల భారం తగ్గించారు. ఉద్యోగులకు ఏడాది కాలంలో రూ.7500 కోట్లు విడుదల చేశారు. . అంగన్వాడీలు, ఆశాలకు రూ.1.5 లక్షల మేర లాభం చేకూరేలా గ్రాట్యుటీ అమలు చేశారు. పోలీసులకు రూ.213 కోట్ల సరెండర్ లీవుల సొమ్ము విడుదల చేశారు. యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 5 చోట్ల రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లు ఏర్పాటు చేస్తున్నారు. విశాఖలో ఎఆూతో ఒప్పందం చేసుకుని స్థలం కేటాయించారు. అమరావతిలో క్వాంటం వ్యాలీకి భూములు కేటాయించారు. ఇలా ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారు. ఎలాగైనా 2029 నాటికి అమరావతి, పోలవరం ప్రాజెక్టును ఓ కొలిక్కి తీసుకురావాలని భావిస్తోంది కూటమి ప్రభుత్వం. కేంద్రం సహకారంతో వచ్చే నాలుగేళ్లు అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తామంటోంది కూటమి ప్రభుత్వం. ప్రధానంగా కూటమి ప్రభుత్వానికి నిధుల సమస్య వెంటాడుతుండగా.. కేంద్రం సహకారంతో ముందుకు సాగుతామంటున్నారు. ఓ వైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ మరో వైపు అభివృద్ధిని కొనసాగించాలంటే అంత ఆషామాషీ కాదు.. వచ్చే నాలుగేళ్లు ఎన్నో సవాళ్లు ఎదురవ్వడం ఖాయమనే చెప్పాలి. మరి చంద్రబాబు తనకు ఉన్న అనుభవంతో ఎలా డీల్ చేస్తారో చూడాలి.

# దసరా నుంచి మెట్రో పనులు షురూ...

విశాఖపట్టణం, జూన్ 12, విశాఖ మెట్రో ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ ఏడాది అక్టోబర్లో విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే కీలక ముందడుగు పడింది. ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ అధికారులు, మెట్రో రైలు అధికారులు విశాఖలో పర్యటించారు. మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. మూడు కారిడార్లతో 42 స్టేషన్లతో విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డీపీఆర్ రూపొందించిన సంగతి తెలిసిందే.విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులో మరో కీలక అడుగు పడింది. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం నిర్దేశించిన ప్రాంతాలను ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ ప్రతినిధులు, మెట్రో రైల్ అధికారులు సోమవారం పరిశీలించారు. అనంతరం.. ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు గురించి కీలక వివరాలు వెల్లడించారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును 46.22 కి.మీ మేరకు నిర్మించనున్నట్లు




తెలిపారు. విశాఖ మెట్రోలో మొత్తం 42 స్టేషన్లు ఉంటాయని వెల్లడించారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశ కోసం రూ.11000 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నట్లు ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి వెల్లడించారు. కొమ్మాది నుంచి కూర్మన్నపాలెం వరకూ.. మెట్రో స్టేషన్ల కోసం నిర్దేశించిన ప్రాంతాలను పరిశీలించినట్లు వెల్లడించారు.మరోవైపు విశాఖ మెట్రో రైలు ప్రాజక్టు నిర్మాణ పనులను అక్టోబర్ నుంచి ప్రారంభించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఏపీ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఇదే విషయాన్ని ఇటీవల వెల్లడించారు. విశాఖ మెట్రో పనులను అక్టోబరులో ప్రారంభిస్తామని.. డబుల్ డెక్కర్ విధానంలో నిర్మించేలా డీపీఆర్ రూపొందించినట్లు నారాయణ ఇటీవల వివరించారు. మరోవైపు విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు కన్సల్టెన్సీ నియామకం కోసం.. అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్ ఏప్రిల్ నెలాఖరులో బిడ్లను కూడా ఆహ్వానించిందిమరోవైపు విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును మూడు కారిడార్లలో నిర్మించాలని డీపీఆర్ రూపొందించారు. మొదటి దశలో మూడు కారిడార్లలో ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయించారు. మొత్తం 46.22 కి.మీ. మేరకు 42 స్టేషన్లతో విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదించారు. విశాఖ స్టీల్ ప్లాంటు-కొమ్మాది కూడలి వరకు ఒక కారిడార్ నిర్మించనున్నారు. ఈ కారిడార్ 34.40 కి.మీ మేర ఉండనుంది. ఈ కారిడార్లో 29 మెట్రోస్టేషన్లు ప్రతిపాదించారు. అలాగే గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు రెండో కారిడార్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ కారిడార్లో 5.07 కి.మీ.లలో 6 స్టేషన్లు ఉండనున్నాయి. తాటిచెట్లపాలెం - చినవాల్తేరు 6.75 కిలోమీటర్ల మేరకు మూడో కారిడార్ నిర్మించనున్నారు. ఈ కారిడార్లో 7 మెట్రో స్టేషన్లు ఉండనున్నాయి.అలాగే విశాఖ మెట్రో ప్రాజెక్టులో ఐదు ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు కూడా ఉండనున్నాయి. రెండు, మూడు ప్రాంతాలను కలుపుతూ ఐదు చోట్ల ఈ ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్ఏడీ కూడలి, తాటిచెట్లపాలెం, గురుద్వారా కూడలి, మద్దిలపాలెం, హనుమంతువాక కూడలి వద్ద ఈ సమీకృత మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇక విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు కోసం కేంద్రం అందించే సహకారంతో పాటుగా.. బ్యాంకుల నుంచి రుణం సేకరించనున్నారు. ఆందులో భాగంగానే ఏడీబీ ప్రతినిధులు సోమవారం విశాఖలో పర్యటించారు.

# వైజాగ్ నుంచి నేరుగా అబుదాబి

విశాఖపట్టణం, జూన్ 12,ఆంధ్రప్రదేశ్ నుండి విదేశాలకు కనెక్టివిటీని పెంచేందుకు విశాఖపట్నం-అబుదాబి మధ్య విమాన సర్వీసులు ఈ నెల 13 నుండి ప్రారంభం కానున్నాయి. ఇండిగో ఎయిర్లైన్స్ ఈ సేవలను వారానికి నాలుగు రోజులు నడవనుంది. జూన్ 15 నుండి విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య కూడా విమాన సర్వీసు ప్రారంభమవుతుంది. విజయవాడ-బెంగళూరు మధ్య ఎయిరిండియా ఎక్స్ప్రెస్ సర్వీసులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. జులై 2 నుండి విజయవాడ నుండి కర్నూలుకు ఇండిగో విమాన సర్వీసును ప్రారంభించనుంది.ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు కనెక్టివిటీలో మరో ముందడుగు పడింది. విశాఖపట్నం-అబుదాబి మధ్య అంతర్జాతీయ విమాన సేవలు ప్రారంభంకానున్నాయి. ఈ నెల 13 (శుక్రవారం) నుంచి ప్రారంభించనున్నట్లు ఇండిగో ఎయిర్లైన్స్ ప్రతినిధులు తెలిపారు. విశాఖపట్నం-అబుదాబి మధ్య నడిచే ఈ విమానం సోమ, బుధ, శుక్ర, ఆదివారాల్లో (వారానికి నాలుగు రోజలు).. విశాఖ విమానాశ్రయం నుంచి ఉదయం 9.45 గంటలకు బయల్దేరి వెళుతుందని పేర్కొన్నారు. ఈ విమానం తిరుగు ప్రయాణంలో అబుదాబి నుంచి అదే రోజు మధ్యాహ్నం 2.35 గంటలకు బయల్దేరి విశాఖపట్నంకు చేరుకుంటుందని తెలిపారు.అలాగే విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య విమాన సర్వీసు జూన్ 15 నుంచి ప్రారంభంకానుంది. ఈ విమానం మధ్యాహ్నం 1.55కి విశాఖపట్నం చేరుకొని తిరిగి 2.25కి భువనేశ్వరకు వెళ్తుంది అన్నారు. ఇటు జూన్ 2 నుంచి విజయవాడ-బెంగళూరు మధ్య ఎయిరిండియా ఎక్స్ప్రెస్ సర్వీసులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరోవైపు ఇండిగో విమానయాన సంస్థ జులై 2 నుంచి విజయవాడ నుంచి కర్నూలుకు విమాన సర్వీసును ప్రారంభించనుంది. దక్షిణ భారత సేల్స్ డైరెక్టర్ సౌరభ్ సచ్దేవా ఈ విషయాన్ని తెలిపారు.విజయవాడ నుంచి దుబాయ్, సింగపూర్లకు కూడా విమాన సర్వీసులు నడపాలని ఏపీ ఛాంబర్స్ కోరింది. గతంలో సింగపూర్కు ఇండిగో విమానాలు నడిపినప్పుడు మంచి స్పందన వచ్చిందని ఛాంబర్స్ గుర్తు చేసింది. ఈ మేరకు సౌరభ్ సచ్దేవా బృందం ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్రావుతో సమావేశమైంది. గతంలో ఇండిగో సింగపూర్కు విమానాలు నడిపినప్పుడు 80 శాతం సీట్లు నిండాయని గుర్తు చేశారు. దుబాయ్, సింగపూర్లకు విమాన సర్వీసులు చాలా అవసరమన్నారు. త్వరలో ప్రారంభంకానున్న ఈ సర్వీసుల ద్వారా ఆంధ్రప్రదేశ్, ఒడిశా మధ్య సంబంధాలు బలోపేతమవుతాయన్నారు పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. ఈ కొత్త విమాన సర్వీసుల ద్వారా ఏపీ రాజధాని ప్రాంతాన్ని భారతదేశంలో ప్రధాన టెక్ హబ్లలో ఒకటైన బెంగళూరుకు అనుసంధానం కావొచ్చు అన్నారు. ఇటు విశాఖ-భువనేశ్వర్ సర్వీసుతో రెండు తూర్పు తీర నగరాల మధ్య వాణిజ్య, పర్యాటక, సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి దోహదపడుతుంది అన్నారు.

# రాశిఫలాలు: ఉద్యోగాల్లో ఏ రాశివారికి ఎలా ఉంటుంది?





2018లో ఉద్యోగాలు ఎలా ఉంటాయి, వృత్తిలో మీరు సాధించే విజయాలు ఏమిటి అనే జాతకాలను ప్రముఖ జ్యోతిష్కుడు అందించారు. మేషం: ఈ రాశివారికి 2018లో కెరీర్ అద్భుతంగా ఉంటుంది. నూతన సంవత్సరాన్ని మీరు మంచి అవకశాలతో ప్రారంభిస్తారు. జనవరి నుంచి ఫిబ్రవరి చివరి వరకు మీకు అత్యంత కీలకకైమైన సమయం. సరైన దిశను ఎంచకోవడంలో మీరు విజయం సాధిస్తారు. సంవత్సరం ప్రారంభంలో మొత్తంగా మీ కెరీర్‌ల నూతనత్వాన్ని పొందుతారు. కొత్త అవకాశాలు పొంది ముందుకు సాగుతారు. ఈ పరిణామం ద్వారా మీర ప్రయోజనం పొందగలరు. మే నెల మధ్యలో మీరు మీ ఉన్నతాధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. సహనం పాటిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయి. ఆవేశంతో వ్యవహరించకూడదు. అంగాకరుడు తిరోగమన దిశలో ఉంటాడు కాబట్టి ముఖ్యమైన నిర్ణయాలు ఏవీ తీసుకోకూడదు. సహోద్యోగులతో సంయమనంతో వ్యవహరించండి. ఉన్నతాధికారులతో వాగ్వివాదాలకు దిగవద్దు. మీ బాస్‌కు తప్పించుకునే పద్ధతిలో సమాధానాలు చెప్పకూడదు. మీ అధికారి కోణం నుంచి విషయాలను చూడడానికి ప్రయత్నించండి. మీ ఉన్నతాధికారులను, సీనియర్లను మీ దృష్టితోనే చూడకూడదు. వారితో సంభాషించేటప్పుడు మర్యాదగా వ్యవహరించండి. అలా చేస్తే మీ ప్రయోజనాలకు భంగం వాటిల్లదు. "ఈ రాశులకు మోయలేనంత డబ్బును మోసుకొస్తున్న శనిదేవుడు" వృషభం ఈ రాశివారికి 2018లో శనిప్రగతి మార్గంలో పయనించడానికి ఉపకరిస్తుంది. వృత్తిలో మీరు ముందుకే సాగుతారు. అయితే, అభివృద్ధికి శ్రమించాల్సి ఉంటుంది. కొంత మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. వృత్తిలో ప్రగతి ఎదురయ్యే ఆటంకాలను, అవాంతరాలను తొలగించుకోవడానికి సిద్ధపడాలి. మీరు ప్రగతి సాధిస్తారు అయితే ముందుకు సాగడానికి పలు ఆటంకాలను అధిగమించాల్సి ఉంటుంది. మే నెల మధ్య భాగంలో రొటీన్ బిజీలో పడిపోతారు. మీరు అన్ని విధాలా శ్రమించాల్సి ఉంటుంది. ఒత్తిడిని కూడా భరించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే ఫలితం వస్తుంది. ఇప్పుడు పెట్టే శ్రమ మీకు భవిష్యత్తులో ఉపయోగపడుతుంది. ప్రగతి, ఆనందం మీకు నల్లేరు మీద బండి నడక కాదు. కఠిన శ్రమతో మాత్రమే మీరు ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగులకు ప్రాజెక్టు పనులపై విదేశాలకు వెళ్లే అవకాశం రావచ్చు. అది మీ వృత్తికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆర్థికంగా కూడా మీకు బాగుంటుంది. సంవత్సరం చివరి మూడు నెలల్లో వృత్తి ప్రగతి సాధిస్తారు. దీన్ని బట్టి 2018 మీకు బాగానే ఉండబోతోంది. "మూడు గ్రహాల సంయోగం.. జూన్ లో ఈ రాశులు పట్టిందల్లా బంగారమే" మిథునం ప్రధానమైన రెండు గ్రహాలు కర్మకు సంబంధించి పదో గృహంలో వివిధ దిశల్లో సంచరిస్తున్నాయి. కర్మకు సంబంధించిన బృహస్పతి దాన్ని నిర్దేశిస్తాడు. మిథునం పదో గృహాన్ని నిర్దేశిస్తుంది. దీన్ని బట్టి 2018లో మిథునం బలంగా ఉంటుంది. అందువల్ల వృత్తిలో మీరు ప్రగతి పథంలో పయనించడానికి ఉత్సాహకరమైన అవకాశాలు వస్తాయి. మీకు వచ్చే సదవకాశాలను సద్వినియోగం చేసుకోండి. పని విషయంలో మీరు శుభవార్త వింటారు. మీ బాస్ మీ పట్ల ఉదారంగా వ్యవహరిస్తారు. దాంతో మీరు మరింత ఉత్సాహంతో, సానుకూల దృష్టితో ముందుకు సాగుతారు. అది పని సమర్థతను పెంచుతుంది. మీకు అమితమైన ప్రోత్సాహం లభించి, మీ పనితీరు మెరుగుపడుతుంది. మీరు మీ బాస్‌తో పంచుకునే మంచి విషయాలు పని విషయంలో మీకు మరింత ప్రోత్సహాన్ని ఇస్తుంది. ఉద్యోగులకు పనిలో ముఖ్యమైన లక్ష్యాన్ని అప్పగించే అవకాశం ఉంది. ఈ విషయంలో మే మధ్యభాగం మీకు అత్యంత కీలకమైంది. ఈ సవాల్‌ను అధిగమించడానికి మీ నైపుణ్యాలను, అనుభవాన్ని పెట్టాల్సి ఉంటుంది. జనీబీ ఓజీఎ ంశ్రీబనీ ఒతినివ "శుక్రుడి అనుగ్రహంతో ఈ రాశులకు అద్భుత రాజయోగం" ఖనీలివతీవట ఃఎ 4 కర్టాటకం ఉద్యోగులకు ఈ ఏడాది అంత సులభమైన విషయమేమీ కాదు. రోజువారీ కార్యకలాపాల్లో కూడా ఆటంకాలు ఎదురవుతాయి. ఎప్పటికప్పుడు సవాల్‌గానే తీసుకోవాల్సి ఉంటుంది. ఉద్యోగులకు గడువులోగా పనులు పూర్తి చేయడానికి ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. ఇటువంటి స్థితిలో కనీసం మీకు సహోద్యోగుల సాయమైన ఉండాలి. అందువల్ల సహోద్యోగులతో సామరస్య వాతావరణాన్ని కల్పించకోవాల్సి ఉంటుంది. అర్హత ఉన్నప్పటికీ మీకు పదోన్నతి రాదు. అది మిమ్మల్ని నిరాశకు గురి చేస్తుంది. మీ జన్మ కుండలిలోని గ్రహాలు సహకరిస్తే తప్ప మీరు ముందుకు సాగలేరు. అయితే, అసంతృప్తి మీరు చేసే పనిపై ప్రభావం చూపకుండా జాగ్రత్త పడండి. మీరు ముందుకు సాగుతూ తీవ్రమైన శ్రమ చేస్తూ సాగండి. జీవితంలో ఆటంకాలు, అపజయాలు సర్వసాధారణం. వాటి ప్రభావం పడకుండా జాగ్రత్త పడండి. వాటిని సరైన స్ఫూర్తితో తీసుకోవాలి. తద్వారా మీరు అవాంతరాలను అధిగమించి ముందుకు సాగుతారు. సింహం ఉద్యోగులైనా, ఫ్రీలాన్సర్ అయినా మీరు వృత్తి మీద దృష్టి పెడుతారు.అది మీ అభివృద్ధికి దోహదపడుతుంది. నిరుద్యోగులకు, ఉద్యోగం మారాలని అనుకునేవారికి సదవకాశాలు వస్తాయి. ఆటంకాలు వస్తుంటాయి గానీ సమర్థంగా పనిచేయడం ద్వారా అధిగమిస్తారు. ఉద్యోగంలో సౌకర్యంగా ఉండలేరు. నిర్ణీత గడువులను, లక్ష్యాలను చేరుకోవడానికి ఎక్కువ సమయం పనిచేయాల్సి ఉంటుంది. అయితే దీన్ని సానుకూల దృష్టితో, సరైన స్ఫూర్తితో స్వీకరించాలి. అంగారక గ్రహం తిరోగమనం సవాళ్లు విసురుతుంది. మీ పరిసరాల్లో మార్పు లేకుండా చూసుకోండి. పెద్ద సవాళ్లను ఎదుర్కోవడం ఒక దశలో చాలా కష్టంగా అనిపిస్తుంది. ఈ విషయంలో మీరు జాగ్రత్తగా వ్యవహరించాలి. జాతకం బాగా లేనప్పుడు సహనంతో, విశ్వాసంతో ముందుకు సాగాల్సి ఉంటుంది. కన్య మీరు లక్ష్యాలపై దృష్టి పెట్టి మెరుగైన పనితీరును కనబరచాల్సి ఉంటుంది మారాలని మీరు అనుకుంటే గ్రహాలు సహకరించవు. అందువల్ల ప్రస్తుత లక్ష్యానికే కట్టుబడి ఇతర విషయాలపై దృష్టి పెట్టకండి. ఏప్రిల్ మధ్య భాగం నుంచి అభివృద్ధి కరమైన శక్తులు సమర్థంగా పనిచేయడం ప్రారంభిస్తాయి. మీ ప్రతిభను కనబరచడానికి ఇది సరైన సమయం. అంటే మీ ప్రతిభ వెలికి రావడానికి గ్రహాలు సహకరిస్తాయి. మీ సృజనాత్మకతను బయటపెట్టడానికి సమయం వ్చే వరకు వేచి చూడండి. అసంతృప్తికి గురి కావద్దు. చాలా విషయాల్లో సహనం అవసరం. పరిస్థితులు మారే వరకు వేచి చూడండి. గ్రహాలు మీకు అనుకూలంగా మారగానే మిమ్మల్ని ఎవరూ నిరోధించలేరు. కేవలం కొంత సమయం పడుతుంది. తుల మీరు ఈ సంవత్సరం అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. మీ చేతిలో ఉన్న లక్ష్యాలను సాధించడానికి అది అవసరం. ఈ కొత్త సవాల్‌ను స్వీకరించడానికి మీరు సిద్ధంగా ఉండాలి. మార్చి మధ్య భాగం మీకు అత్యంత కీలకమైంది. సవాళ్లకు మీరు భయపడకూడదు. పని చాలా సంక్లిష్టంగా ఉన్నప్పుడు ఎక్కువ తప్పు చేయకుండా జాగ్రత్త పడండి. ఒక లక్ష్యాన్ని ఒక సమయంలో చేయడానికి ప్రయత్నించండి. అంగారకుడు మిమ్మల్ని తొందరపెడుతాడు. దాని వల్ల తప్పులు చేసే అవకాశం ఉంటుంది. సమయానికి సంబంధించిన పరిమితిని, హద్దులను గుర్తు పెట్టుకోండి. అదే సమయంలో మీ పనికి సంబంధించిన అవసరాల విషయంలో రాజీ పడకూడదు. గడువులోగా పనిచేయడమే కాకుండా మీరు చేసే పనిలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలి. వృశ్చికం మంచి ఉద్యోగం కోసం, మంచి వేతనం కోసం ప్రయత్నిస్తారు. సవాళ్ల ద్వారా మాత్రమే అవకాశాలు లభిస్తాయి. ఈ సవాళ్లను స్వీకరించడానికి సిద్ధంగా ఉండండి. మార్చి మధ్య భాగంలో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. పనులను పూర్తి చేయడానికి తొందర పడుతారు. మీ బాస్ మిమ్మల్ని ముందుకు తోస్తూ మీ సమర్థత పెరగడానికి ఉపయోగపడుతాడు. దాన్ని ఒత్తిడిగా భావించకండి. లో ప్రొఫైల్ అవసరం. మీ బాస్‌తో వాగ్వాదానికి దిగకూడదు. మీరిచ్చే సమాధానాలు కుప్తంగా ఉండాలి. తప్పించుకునే పద్ధతిలో మాట్లాడకూడదు. ప్రశాంతంగా ఉండాలంటే వాటిని మనసుల్లో పెట్టుకోవడం మంచిది. సమతుల్యత పాటించడం కూడా ముఖ్యం. ధనుస్సు మీకు సదవకాశాలు లభిస్తాయి. వృత్తిపరంగా బాగుంటుంది. పని స్థలంలో మీరు సౌకర్యవంతంగా ఉంటారు. మీకు ఓముఖ్యమైన లక్ష్యాన్ని ఇచ్చే అవకాశం ఉంది. దాన్ని మీరు అత్యంత సామర్థ్యంతో నెరవేర్చాల్సి ఉంటుంది. ఫలితం సాధించడానికి మీ శక్తియుక్తులన్నింటినీ పెట్టాల్సి ఉంటుంది. ఆ లక్ష్యం మీ వృత్తిలో ఓ మలుపు అవుతుంది. వృత్తిలో పురోగమించడానికి అది ఎంతో ఉపయోగపడుతుంది. మీకు వృత్తిపరంగా అభివృద్ధి, విజయాన్ని తెచ్చిపెడుతుంది. ఉద్యోగంలో మీరు పదొన్నతి పొందే అవకాశం ఉంది. దాన్ని మీరు మంచి స్ఫూర్తితో స్వీకరించాలి. మీకు అది ఎంతో సంతృప్తిని ప్రసాదిస్తుంది. ఆనందాన్నిస్తుంది. ఈ మధ్యలో మీకు ఓ సవాల్ ఎదురవుతుంది. అయితే, అది పెద్దగా ఇబ్బంది పెట్టదు. మకరం మీరు పనిచేసే సంస్థలో తీరిక లేకుండా ఉంటారు. గడువులను, లక్ష్యాలను చేరుకోవడానికి ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేయాల్సి ఉంటుంది. ప్రగతిశక్తులు మీకు సంవత్సరమంతా సాయపడుతాయి. సెప్టెంబర్ నుంచి వృత్తిదారులకు, ఉద్యోగులకు కలిసి వస్తుంది. మీకు ముఖ్యమైన, సంక్లిష్టమైన పనిని అప్పగించే అవకాశం ఉంది. ఇది మీకు మంచి అవకాశం. మీ నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుంది. పనిని పూర్తి చేయడానికి మీ శక్తినంతా ఉపయోగించండి. ఇది మీకే కాకుండా మీ చుట్టూ ఉన్నవారికి కడా ఆనందాన్ని ఇస్తుంది. మీ పనికి మీ ఉన్నతాధికారులు కూడా సంతోషిస్తారు. ఆ లక్ష్యాన్ని మిమ్మల్ని పరీక్షించడానికే ఇస్తారు. ఆ సంక్లిష్టమైన పనిని మీరు పూర్తి చేస్తే మీలో విశ్వాసం పెరగడమే కాకుండా ఇతరుల మెప్పు కూడా పొందుతారు. కుంభం పని స్థలాల్లో సౌకర్యంగా ఉంటారు. ఉద్యోగుల అవకాశాలు మెరుగవుతాయి. మీకు మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. పని సంతృప్తి లభిస్తుంది. జూన్‌లో మంచి ఉద్యోగవకాశాలు, మంచి వేతనంతో లభించే అవకాశం ఉంది. ఉద్యోగం మారాలనుకునేవారికి కూడా మంచి అవకాశాలు లభిస్తాయి. ఆ సమయంలో మీకు అన్నీ శుభాలే కలుగుతాయి. అటువంటి కోరిక ఉంటే మీరు ముందుకు సాగవచ్చు. ఆగస్టు నుంచి మీకు విశాలమైన వేదికలు లభిస్తాయి. మీ ప్రతిభను ప్రదర్శించుకోవడానికి మంచి అవకాశాలు లభిస్తాయి. కష్టతరమైన లక్ష్యాలను కూడా సాధిస్తారు. మీనం ప్రస్తుతం ఉన్న ఉద్యోగంలో భద్రతగా ఉంటారు. మార్చి మధ్య వరకు ఉద్యోగులకు అంత మంచి కాలం కాదు. మార్చి మధ్య కాలం నుంచి తీరిక ఉండదు. ఉద్యోగులు కొన్ని కష్టతరమైన లక్ష్యాలు సాధించాల్సి ఉంటుంది. ఫలితం సాధించడానికి నైపుణ్యాలను మెరుగుపరుచుకుని, మీ అనుభవాన్నంతా పెట్టాల్సి ఉంటుంది. అది అవకాశంగా కనిపించినప్పటికీ కొన్ని సమయాల్లో అది కష్టతరంగా అనిపిస్తుంది. అది తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తుంది. పనులను పూర్తి చేయడానికి రు తొందరపడాల్సి వస్తుంది. కాలంతో పాటు పరుగెత్తాల్సి ఉంటుంది. మీరు పరిస్థితిని సరైన పద్ధతిలో మీకు అనుకూలంగా మలుచుకోవాల్సి ఉంటుంది.


# "గ్రీన్ టీ" తో సైడ్? ఎఫెక్ట్స్..!? వీరు దూరంగా ఉంటేనే మంచిది..!!

గ్రీన్ టీ. ఇది ఆరోగ్య కరమైనది అందరూ భావిస్తారు. రెగ్యులర్ గా తీసుకునే వారు ఉన్నారు. గ్రీన్ టీ తో మంచి ఎంత ఉందో.. కొందరికి అంత సమస్యలు ఖాయమని తాజా పరిశోధనల ద్వారా వెల్లడి అవుతోంది. అధికంగా తీసుకోవటం నష్టం చేస్తుందని గుర్తించారు. అందులో మందులు తీసుకునే వారు.. కొన్ని అనారోగ్య సమస్యలతో ఉన్నవారు ఈ గ్రీన్ టీని పరిమితంగా తీసుకోవటం మంచింది. మితంగా తీసుకుంటే యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తూ మెలబాలిజం మెరుగు చేస్తుంది. అయితే, అధికంగా తీసుకుంటే మాత్రం ప్రతికూల ప్రభావాలు తప్పవు. గ్రీన్ టీ లో ఔషధ గుణాలు ఉన్నాయనే నమ్మకం ఉంది. అనేక మంది గ్రీన్ టీని ఎక్కువగా వినియో గిస్తూ ఉంటారు. అయితే, ఎక్కువగా గ్రీన్ టీ తీసుకోవటం ద్వారా నిద్రలేమి.. తల నొప్పుల సమస్య లు వస్తాయని చెబుతున్నారు. పరిమితంగా తీసుకున్న వారిలో సమస్యలను తక్కువగా గుర్తించిన ట్లు వెల్లడించారు. రోజుకు ఒకటి లేదా రెండు సార్లు తీసుకునే వారికి సమస్యలు దూరంగా ఉంటా యని పరిశోధకులు వెల్లడించారు. అధిక మోతాదులో తీసుకున్నప్పుడు కాలేయానికి నష్టం కలిగే అవకాశం ఉందని పలు పరిశోధనలో తేలింది. ఇందులో ఉండే కాటెచిన్స్ హెపాటోటాక్సిసిటీకి కారణమవుతుందని నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పేర్కొంది.' దీని కారణంగా కాలేయ సమస్యలు ఉన్నవారు గ్రీన్ టీ పరిమితంగా తీసుకోవాలని.. వైద్యుల సలహా మేరకే నడుచుకోవటం మంచింది. గ్రీన్ టీలో ఉండే టానిన్లు శరీరంలో యాసిడ్ స్థాయిలను పెంచ టంతో వికారం, మలబద్ధకం, కడుపులో అసౌకర్యం, రక్తపోటు పెరగడం లాంటి సమస్యలు రావొచ్చని నేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ అధ్యయన నివేదికలో వెల్లడైంది. గ్రీన్ టీ అనేది ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తుందని, దీన్ని ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల ఐరన్ లోపం రావడంతో పాటు అనీమియాకు దారితీస్తుందని పేర్కొంది. బోలు ఎముకల వ్యాధి ఉన్నవారు గ్రీన్ టీకి దూరంగా ఉండే మంచిదని సూచిస్తున్నారు. గర్భవతులు గ్రీన్ టీ తాగే ముందు సంబంధిత డాక్టర్లును సంప్రదించడం మంచిదని పేర్కొన్నారు.



# డయాబెటిస్ ఉన్న వారికి కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఎందుకు వస్తుంది?

ఈ మధ్యకాలంలో కిడ్నీలు ఫెయిల్ అవుతున్న సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం డయాబెటిస్. డయాబెటిస్ కారణంగా మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఎక్కువగా ఉంది. షుగర్ వ్యాధిగ్రస్తుల్లో మూత్రపిండాల సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయి. డయాబెటిస్ బాధితులు మూత్రపిండాల సమస్యల విషయంలో జాగ్రత్తగా లేకుంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. కిడ్నీలు మన శరీరంలో చేసే పని ఇదే కిడ్నీలు మన శరీరంలోని వ్యర్థాలను, టాక్సిన్లను ఫిల్టర్ చేసి మూత్రం ద్వారా బయటకు పంపుతాయి. అంతేకాకుండా రక్తపోటును నియంత్రిస్తాయి. కొన్నిసార్లు శరీరానికి అవసరమైన హార్మోన్లను కూడా ఉత్పత్తి చేస్తాయి. మూత్రపిండాలు చెడిపోయినప్పుడు ఈ ప్రక్రియ సక్రమంగా జరగదు. ఫలితంగా డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మధుమేహంతో కిడ్నీ సమస్యలకు లింక్ మధుమేహం బారిన పడిన వారిలో ఇన్సులిన్ తగినంత ఉత్పత్తి కాదు. ఇన్సులిన్ రక్తంలోని షుగర్ లెవెల్స్‌ను నియంత్రిస్తుంది. మధుమేహం ఉన్నవారిలో ఇన్సులిన్ తగినంతగా ఉత్పత్తి కాకపోవడం వల్ల షుగర్ లెవెల్స్ విపరీతంగా పెరిగిపోతాయి. ఇది శరీరంలోని చిన్న రక్తనాళాలను దెబ్బతీస్తుంది. దీనివల్ల వివిధ అవయవాలు సరిగ్గా పనిచేయవు. ఇది కిడ్నీలపై ప్రభావం చూపి, టాక్సిన్లను బయటకు పంపే ప్రక్రియను తగ్గిస్తుంది. దీనివల్ల నరాలు దెబ్బతింటాయి. కిడ్నీలు దెబ్బతినకుండా ఇలా చెయ్యండి ఒక్కోసారి మూత్రం రావటం కూడా కష్టమవుతుంది. మూత్రాన్ని ఖాళీ చేయకపోవడం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి పెరిగి యూరినరీ ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది.




కనుక కిడ్నీల ఆరోగ్యం కోసం డయాబెటిస్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మధుమేహం కారణంగా కిడ్నీలు దెబ్బతినకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. రక్తంలోని షుగర్ లెవెల్స్‌ను ఎప్పుడూ అదుపులో ఉంచుకోవాలి. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ సోకితే వెంటనే వైద్యుడిని సంప్రదించి వారి సలహాలు పాటించాలి.ఇలా చేస్తే కిడ్నీ సమస్యల నుండి రిలీఫ్ అధిక రక్తపోటు సమస్య రాకుండా జాగ్రత్త పడాలి. ధూమపానం చేయకుండా దూరంగా ఉండాలి. స్మోకింగ్ చేయడం మానుకోవడం మంచిది.పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా వాడకూడదు.మధుమేహం నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా కిడ్నీ సంబంధిత సమస్యలను నివారించవచ్చు.

# ఈ రాశులకు మోయలేనంత డబ్బును మోసుకొస్తున్న శనిదేవుడు

నవగ్రహాల్లో కీలకమైన శనిదేవుడు న్యాయానికి ప్రతీక. నీతి, నిజాయితీగా ఉండేవారికి ఆయన ఎక్కువ ప్రాధాన్యతనిస్తాడు. ప్రతి రాశిలో సంచారం చేయడానికి రెండున్నర సంవత్సరాల సమయం తీసుకుంటాడు. అత్యంత నెమ్మదిగా కలిగే గ్రహం శని అని పేరు. అందుకే వ్యక్తి జాతకంలో శని ప్రభావం చాలా నెమ్మదిగా కదులుతుంటుంది. శని తర్వాత రాహువు, కేతువు నెమ్మదిగా కదులుతారు. వారు రాశిని మార్చడానికి 18 నెలల సమయం తీసుకుంటారు. ఏప్రిల్ 28వ తేదీన శని గ్రహ సంచారంలో అనేక మార్పులు సంభవించాయి. అలాగే ఈ నెల ఏడో తేదీన ఉత్తరాభాద్ర నక్షత్రంలోకి ప్రవేశించింది. ఈ పరిణామాలన్నీ కలిపి కొన్ని రాశులకు అదృష్టాన్ని మోసుకొచ్చాయి. ఏయే రాశులకు ఎలా కలిసివస్తోందనే విషయాన్ని, వివరాలను తెలుసుకుందాం. మే" కర్కాటక రాశి ఆర్థిక పరిస్థితులు చాలావరకు మెరుగుపడతాయి. ఉద్యోగస్థులకు వేతనం పెరగడంతోపాటు పదోన్నతి ఉంది. అన్ని పనుల్లోను ఈ రాశివారు అద్భుతమైన విజయాలను సొంతం చేసుకుంటారు. వ్యాపారస్తులకు మంచి లాభాలున్నాయి. కొత్తగా కారుతోపాటు ఇంటిని కూడా కొనుగోలు చేస్తారు. ఆస్తులు కలిసివస్తాయి. ఎప్పటినుంచో ఉన్న సొంతింటి కలను ఈ సమయంలోనే నెరవేర్చుకుంటారు. తులా రాశి కొత్తగా ప్రాజెక్టులు ప్రారంభించడంవల్ల భారీ మొత్తంలో లాభాలను ఆర్జించడంతోపాటు కొత్త ప్రాజెక్టుల్లో కూడా పెట్టుబడి పెడతారు. ఆర్థిక పరిస్థితులన్నీ అనుకూలిస్తాయి. అందరూ సంతోషంగా ఉంటారు. జీవితంలో సానుకూల మార్పులు చోటుచేసుకుంటాయి. డబ్బుకు సంబంధించి ఇబ్బంది లేకుండా జీవితం గడుస్తుంది. ఈ రాశివారు దుబారా ఖర్చులను నియంత్రించుకోవాలి. మకర రాశి డబ్బుకు సంబంధించిన సమస్యలు వెంటాడుతున్నాయి.



# సినిమా



## 'ఐకాన్' మూవీ సంగతేంటి? కచ్చితంగా ఉంటుందా?



: 'ఐకాన్' ప్రాజెక్ట్ గుర్తుందా? అల్లు అర్జున్ హీరోగా ఆ సినిమాను వేణు శ్రీరామ్ తెరకెక్కించాలని అనుకున్నారు. స్క్రిప్ట్ వర్క్ కూడా చేశారు. భారీ బడ్జెట్ తో దిల్ రాజు సినిమాను నిర్మించేందుకు సిద్ధమయ్యారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా నిర్వహించారు. కానీ ఆ సినిమా మాత్రం ఇప్పటికీ పట్టాలెక్కలేదు. ఎలాంటి అప్డేట్ కూడా లేదు. ముఖ్యంగా.. వేణు శ్రీరామ్ వకీల్ సాబ్ కోసం పవన్ కళ్యాణ్ నుంచి కాల్ రావడంతో అటు వెళ్లిపోయారు. ఆ తర్వాత ఐకాన్ మూవీ చేస్తారని అంతా అనుకున్నారు. కానీ ఈ లోపు సుకుమార్ తో పుష్ప సిరీస్ చిత్రాలకు గాను బన్నీ బిజీ అయిపోయారు. ఇప్పుడు అట్లీతో భారీ బడ్జెట్ తో రానున్న పాన్ ఇండియా మూవీకి గాను వర్క్ చేస్తున్నారు. మరోవైపు, వేణు శ్రీరామ్.. ఇప్పుడు యంగ్ హీరో నితిన్ తో తమ్ముడు మూవీ చేశారు. దిల్ రాజు నిర్మించిన ఆ సినిమా.. జులై 4వ తేదీన వరల్డ్ వైడ్ గా విడుదల కానుంది. అయితే ఐకాన్ కథతోనే తమ్ముడు తెరకెక్కించారనే సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగింది. ఆ విషయంపై ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో వేణు శ్రీ రామ్ రెస్పాండ్ అయ్యారు. వకీల్ సాబ్ తర్వాత తాను ఐకాన్ స్క్రిప్టుపై వర్క్ చేశానని తెలిపారు. ఆ తర్వాత తమ్ముడు కథ రాశానని అన్నారు. ఆ స్టోరీని కొందరు హీరోలకు చెబితే.. నటించేందుకు నో చెప్పారని, నితిన్ మాత్రం కథను అర్థం చేసుకుని పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని పేర్కొన్నారు. స్క్రీన్ ప్లే కొత్తగా ఉంటుందని, ఐకాన్– తమ్ముడు వేర్వేరు కథలుగా చెప్పారు. దీంతో రూమర్స్ కు చెక్ పెట్టినట్టైంది. అదే సమయంలో ఐకాన్ స్క్రిప్ట్ ఇంకా అలాగే ఉందని.. వదిలేయలేదని క్లియర్ గా తెలుస్తోంది. ఐకాన్‌లో ప్రధాన పాత్ర పోషించడానికి సరైన నటుడి కోసం నిర్మాణ సంస్థ వెతుకుతోందని జోరుగా ప్రచారం సాగుతోంది. ఆ తర్వాత మళ్ళీ ప్రాజెక్ట్ ను అనౌన్స్ చేస్తారని ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. అయితే ఐకాన్ టైటిల్ ను దిల్ రాజు ఎప్పుడో రిజిస్టర్ చేసుకోగా.. దాన్ని ఇప్పుడు అల్లు అర్జున్ మూవీ కోసం అట్లీ యూజ్ చేస్తారని కొద్ది రోజులుగా ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. కానీ ఇప్పుడు వేణు శ్రీరామ్ ఆన్సర్ తో అవి కూడా రూమర్సేనని అర్థమవుతోంది. మరి ఐకాన్ లో ఎవరు నటిస్తారో.. సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందో అంతా వేచి చూడాలి.



## డైరెక్టర్ గా మారనున్న హీరోయిన్?


టాలీవుడ్ ఆడియన్స్ ను కట్టిపడేసిన హీరోయిన్లలో చందమామ కాజల్ కూడా ఒకరు. స్క్రీన్ పై ట్రెండీ గా కనిపించడంతో పాటూ హీరోల పక్కన మాస్ స్టెప్పులేస్తూ తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన కాజల్ కేవలం సినిమాలే కాకుండా వెబ్‌సిరీస్‌లు, స్పెషల్ సాంగ్స్ కూడా చేస్తూ తనదైన గుర్తింపు తెచ్చుకుంది. పాన్ ఇండియన్ హీరోయిన్ గాపేరు తెచ్చుకున్న కాజల్, తెలుగు సినిమాల్లో నటించి బాగా పాపులర్ అయింది.మొదట్లో గ్లామరస్ పాత్రల్లో నటించినా, ఆ తర్వాత మగధీర, చందమామ లాంటి సినిమాల్లో మంచి పాత్రలు చేసి మెప్పించిన కాజల్, ఆ తర్వాత తమిళంలో అందాల ఆరబోతకే ఎక్కువగా పరిమితమైంది. మధ్యలో ఒకటి రెండు లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేసినా అవి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. 2020లో గౌతమ్ కిచ్లుని పెళ్లి చేసుకుని మధ్యలో కొన్నాళ్ల పాటూ కాజల్ ఇండస్ట్రీకి దూరమైంది. బాబు పుట్టాక మళ్లీ ఇండస్ట్రీకి రీఎంట్రీ ఇచ్చిన కాజల్, ప్రస్తుతం కమల్ హాసన్ చేస్తున్న ఇండియన్3లో ఓ కీలక పాత్రలో నటిస్తోంది. దీంతో పాటూ మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్టుగా వస్తున్న మైథలాజికల్ మూవీ కన్నప్పలో పార్వతీదేవిగా నటించింది. ఇవి కాకుండా కాజల్ చేతిలో కొత్త అవకాశాలేమీ లేవు. ఓ వైపు కమర్షియల్ యాడ్స్ లో నటిస్తూ, మరోవైపు సొంత బిజినెస్ లతో కూడా కాజల్ బిజీగా ఉంది. అయితే సినిమాల పరంగా తనకు ఛాన్సులు తక్కువైన నేపథ్యంలో మళ్లీ అవకాశాలను దక్కించుకోవాలనే ఆలోచనతో కాజల్ ఓ నిర్ణయానికి



వచ్చినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే కాజల్ మెగాఫోన్ ను పట్టి డైరెక్టర్ గా సినిమా చేయాలని చూస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. ప్రైమ్ టైమ్ లోకి రావాలనే ఆలోచనతో స్వీయ దర్శకత్వంలో హీరోయిన్ గా సినిమా చేయాలని చూస్తోందట. బాలీవుడ్ లో కమర్షియల్ అంశాలతో ఓ సినిమాను తెరకెక్కించడానికి కాజల్ సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఆల్రెడీ కెరీర్లో స్టార్ స్టేటస్ ను ఎంజాయ్ చేసిన కాజల్ ఇప్పుడు వచ్చిన ఆఫర్లను చేసుకుంటూ, వ్యాపారాలను చేసుకోకుండా అనవసరంగా డైరెక్టర్ గా మారి రిస్క్ చేయడం ఎందుకని ఆమె ఫ్యాన్స్ భావిస్తున్నారు. మరి కాజల్ మనసులో ఏముందో చూడాలి.

## ఆ సినిమాలపై కింగ్ డమ్ ఎఫెక్ట్!

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ.. ఇప్పుడు సరైన హిట్ కోసం వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. లైగర్, ఫ్యామిలీ స్టార్ సినిమాలతో నిరాశపరిచిన ఆయన.. ఇప్పుడు కింగ్ డమ్ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. పీరియాడిక్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న ఆ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ కానున్న ఆ సినిమాలో భాగ్యశ్రీ బొర్సే హీరోయిన్ గా నటిస్తున్నారు. అయితే ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నా.. కింగ్ డమ్ వాయిదా పడింది. మే 30వ తేదీ నుంచి జులై 4కి వాయిదా వేశారు మేకర్స్. ఇప్పుడు ఆ తేదీకి యంగ్ హీరో నితిన్ తమ్ముడు మూవీతో రానున్నారు. ప్రమోషన్స్ కూడా స్టార్ట్ చేశారు. దీంతో విజయ్ మూవీ మరోసారి వెనక్కి వెళ్లడం ఖాయమైనట్లే. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ఇంకా బ్యాలెన్స్ ఉండడం వల్ల కింగ్ డమ్ లేట్ అవుతుందని తెలుస్తోంది. మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఇంకా రీరికార్డింగ్ వర్క్ ను పూర్తి చేయలేదని సమాచారం. ఈ మంత్ ఎండింగ్ కల్లా కంప్లీట్ చేస్తారని టాక్. అలా అనుకున్నట్లు జరిగితే.. జూలై 25వ తేదీన కింగ్ డమ్ రిలీజ్ చేస్తారని వినికిడి. త్వరలో అధికారికంగా కొత్త విడుదల తేదీని మేకర్స్



ప్రకటించనున్నారట. అయితే కింగ్ డమ్.. మేకర్స్ కొన్ని సీన్స్ ను రీషూట్ చేశారని కొద్ది రోజుల క్రితం టాక్ వినిపించింది. దీంతో విజయ్.. ఇంకా ఇప్పటి వరకు ఆ లుక్ లోనే ఉన్నారుదాని వల్ల ఆయన అప్ కమింగ్ సినిమాలపై ఎఫెక్ట్ పడినట్లు క్లియర్ గా తెలుస్తోంది. ప్రస్తుతం విజయ్ లైనప్ లో కింగ్ డమ్ కాకుండా.. రాహుల్ సాంకృత్యాన్, రవి కిరణ్ కోలాతో చేయాల్సిన సినిమాలు ఉన్నాయి. ఏప్రిల్ లో కింగ్ డమ్ ను పూర్తి చేసిన విజయ్.. మే లో సాంకృత్యాన్ తీసే సినిమా సెట్స్ లో చేరాలని అనుకున్నారట. కానీ కింగ్ డమ్ లుక్ ను మెయింటైన్ చేయడం వల్ల అది సాధ్యపడలేదు. దీంతో జూన్ కు వాయిదా వేశారని టాక్. ఇప్పుడు కింగ్ డమ్ తో పాటు రాహుల్ సాంకృత్యాన్ సినిమాలు లేట్ అవ్వడం వల్ల రవి కిరణ్ కోలా దర్శకత్వం వహించే రౌడీ జనార్ధన్ కూడా ఆలస్యం కానుంది. మొత్తానికి కింగ్ డమ్ ఎఫెక్ట్.. విజయ్ రెండు సినిమాలపై పడిందని చెప్పాలి.

## చిరు–అనిల్ మూవీ... ఆ రెండు ఫుల్‌గా ఉంటాయట!



మెగాస్టార్ చిరంజీవి ఇప్పటికే చేసిన విశ్వంభర సినిమా కంటే ప్రస్తుతం చేస్తున్న అనిల్ రావిపూడి సినిమాపైనే అంచనాలు భారీగా ఉన్నాయి. విశ్వంభర సినిమాను ఈ ఏడాది చివరి వరకు ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇక అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. సినిమా షూటింగ్ ప్రారంభం కాకముందు నుండే దర్శకుడు అనిల్ రావిపూడి ప్రమోషన్ షురూ చేశాడు. సినిమా షూటింగ్ ప్రారంభించిన తర్వాత అంచనాలు రోజు రోజుకు పెరుగుతూ పోతున్నాయి. ఈ సినిమాలో హీరోయిన్‌గా నయనతార నటిస్తున్న విషయం తెల్సిందే.అనిల్ రావిపూడి గత చిత్రం సంక్రాంతికి వస్తున్నాం విజయంలో కీలక పాత్ర పోషించింది ఏంటి అంటే అంతా ఠక్కున చెప్పే విషయం కామెడీ. ఆ సినిమా మాత్రమే కాకుండా అనిల్ రావిపూడి గతంలో వచ్చిన సినిమాల్లోనూ ఎక్కువ శాతం కామెడీ ఉంటుంది. ఒక్క భగవంత్ కేసరి మినహా మిగిలిన సినిమాల్లో ఎక్కువ శాతం కామెడీ ఉంటుంది. ఇక చిరంజీవి సినిమాలోనూ మాస్ మసాలా కామెడీ ఉంటుందని సమాచారం అందుతోంది. అంతే కాకుండా చిరంజీవి వింటేజ్ యాక్టింగ్, వింటేజ్ కామెడీ సీన్స్‌ను ప్రేక్షకులు చూడబోతున్నారని మేకర్స్ చాలా నమ్మకంగా చెబుతున్నారు. చిరంజీవి – అనిల్ రావిపూడి కాంబో మూవీని కేవలం కామెడీకి పరిమితం చేయకుండా ఆకట్టుకునే ఫ్యామిలీ ఎమోషన్స్‌ను చూపించబోతున్నారు. సాధారణంగా ఎమోషన్స్ ఎక్కువ అయితే కామెడీ ఉన్నా భారంగా అనిపిస్తుంది. అందుకే దర్శకుడు అనిల్ రావిపూడి కామెడీతో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్‌ను బ్యాలన్స్ చేస్తూ స్క్రీన్‌ప్లే రాసుకున్నట్లు తెలుస్తోంది. ఎమోషన్స్‌తో కాస్త స్క్రీన్ ప్లే భారంగా సాగుతుంది అనుకున్న సమయంలో కామెడీ సీన్స్ వస్తాయట. అలా కామెడీతో పాటు ఫ్యామిలీ భావోద్వేగాలను అద్భుతంగా ఈ సినిమాలో దర్శకుడు అనిల్ రావిపూడి పండించబోతున్నాడు అంటూ చిత్ర యూనిట్ సభ్యులు ఆఫ్ ది రికార్డ్ చెబుతున్నారు. చిరంజీవి, అనిల్ రావిపూడి సినిమా అనగానే ఫ్యామిలీ ఆడియన్స్ చాలా ఆసక్తిని కనబర్చుతున్నారు. అందుకే ఫ్యామిలీ ఎమోషన్స్‌కి కూడా పెద్ద పీట వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కచ్చితంగా ఉంటుందా? 2026 సంక్రాంతికి విడుదల కాబోతున్న చిరంజీవి–అనిల్ రావిపూడి మూవీలో హీరోయిన్‌గా నయనతార నటిస్తున్న నేపథ్యంలో తమిళ్‌లోనూ ఈ సినిమాకు బజ్ క్రియేట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే అనిల్ రావిపూడి సినిమాలు కేవలం తెలుగులో మాత్రమే విడుదల అవుతూ ఉంటాయి. మరి ఈసారి ఆ సెంటిమెంట్‌ను బ్రేక్ చేసి ఇతర భాషల్లో కూడా విడుదల చేస్తారా అనేది చూడాలి. ఈ సినిమాకు భీమ్స్ సంగీతాన్ని అందిస్తున్నాడు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మెగాస్టార్ సినిమాలోని పాటలు సైతం అదే స్థాయిలో ఉండే విధంగా భీమ్స్ కసితో వర్క్ చేస్తున్నాడని మేకర్స్ అంటున్నారు. ఈ సినిమాను సాహు గారపాటితో కలిసి నిహారిక కొణిదెల నిర్మిస్తున్న విషయం తెల్సిందే. అతి త్వరలోనే సినిమా నుంచి కీలక అప్డేట్ రాబోతుందని సమాచారం అందుతోంది. అది ఏంటి, ఎప్పుడు చూడాలి.

## దర్శకుడి పెళ్లికి హీరో నితిన్ కారణం..!

నితిన్ హీరోగా రూపొందిన 'తమ్ముడు' సినిమా విడుదలకు సిద్ధం అయింది. జులై 4న విడుదల కాబోతున్న తమ్ముడు సినిమాలో హీరోయిన్స్‌గా సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మలు నటించారు. వకీల్ సాబ్ ఫేం వేణు శ్రీరామ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. ఇక ఈ సినిమాతో సీనియర్ హీరోయిన్ లయ రీ ఎంట్రీ ఇస్తున్న విషయం తెల్సిందే. 20 ఏళ్ల తర్వాత లయ ఈ సినిమాలో నటించింది. నితిన్‌కి అక్క పాత్రలో లయ కనిపించింది. టైటిల్‌ను చూస్తూ ఉంటే సినిమా మొత్తం కథ ఆమె చుట్టూ తిరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. హీరోయిన్‌గా లయ చాలా సినిమాల్లో నటించింది, నటిగా మంచి ఫేమ్ ఉన్న సమయంలోనే పెళ్లి చేసుకుని విదేశాలకు వెళ్లింది. పిల్లలు పెద్దవాళ్ళు అయిన తర్వాత లయ తిరిగి సినిమాల్లో రీ ఎంట్రీకి సిద్ధం అయింది. తమ్ముడు సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రమోషన్స్ కార్యక్రమాలు వేగవంతం చేశారు. ఇటీవల సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ ఈవెంట్‌లో దర్శకుడు వేణు శ్రీరామ్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. నితిన్‌తో చాలా కాలం క్రితమే సినిమా చేయాల్సి ఉంది. కానీ కొన్ని కారణాల వల్ల సెట్ కాలేదు అన్నాడు. నితిన్ వంటి హీరోలు ఇండస్ట్రీలో చాలా అరుదుగా ఉంటారు. సాధారణంగా హీరోలకు ఇన్‌సెక్యూర్ ఫీలింగ్ ఉంటుంది. కానీ నితిన్‌లో మాత్రం అది ఏమాత్రం కనిపించదు. ఆయన ఎప్పుడూ అభద్రతా భావంతో కనిపించ లేదు. ఆయన ఎప్పుడు చాలా ఓపెన్‌గా ఉంటారు అని వేణు శ్రీరామ్ అన్నారు. కచ్చితంగా ఉంటుందా? సినిమా మేకింగ్ విషయంలోనే కాకుండా ప్రతి విషయంలోనూ నితిన్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఆయన ఇచ్చిన ఫ్రీడం కారణంగా తమ్ముడు సినిమాను అద్భుతంగా తీశామని చెప్పుకొచ్చాడు. ఇక నితిన్ సినిమా కోసం తాను గతంలో రచయితగా పని చేసే సమయంలో ఒక అమ్మాయితో పరిచయం అయ్యి, ఆమెను పెళ్లి చేసుకున్నాను అన్నాడు. తన వ్యక్తిగత జీవితంలో నితిన్ చాలా ముఖ్యమైన వ్యక్తి అని చెప్పకనే చెప్పాడు. ఇక హీరోగా నితిన్ తో తాను తీసిన ఈ సినిమాతో హిట్ కొట్టడం ఖాయం అని కూడా వేణు శ్రీరామ్ చెప్పుకొచ్చాడు. ఈ సినిమా సుదీర్ఘ కాలంగా సెట్స్ పై ఉంది. కొన్ని కారణాల వల్ల ఆలస్యం అవుతూ వచ్చిన తమ్ముడు ఎట్టకేలకు పూర్తి అయ్యి విడుదలకు సిద్ధం అయింది. నితిన్ ఈ మధ్య కాలంలో చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. అందుకే ఈ సినిమాపై ఆయనతో పాటు ఆయన అభిమానులు నమ్మకం పెట్టుకుని వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమా సక్సెస్ అవుతుంది అనేందుకు చాలా కారణాలు కనిపిస్తున్నాయి. అందులో ముఖ్యమైనది ఒక మంచి కమర్షియల్ సబ్జెక్ట్‌తో ఈ సినిమాను రూపొందించారు. అంతే కాకుండా ఈ సినిమాకు దిల్ రాజు నిర్మాత కావడం వల్ల కూడా అంచనాలు పెరిగాయి. భారీ అంచనాల నడుమ రూపొందిన ఈ తమ్ముడు సినిమా ఎలాంటి ఫలితాన్ని చవిచూస్తుంది అనేది తెలియాలి అంటే జులై 4 వరకు వెయిట్ చేయాల్సిందే. ఈ సినిమా హిట్ అయితే లయ వరుస సినిమాలను తెలుగులో చేస్తుందేమో చూడాలి. ఈ సినిమా విజయం హీరో నితిన్‌కి, దర్శకుడు వేణు శ్రీరామ్‌తో పాటు లయకి అత్యంత కీలకం. మరి ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.



# పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన...

- ప్రతీ పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే ధ్యేయమన్న ఎమ్మెల్యే
- ఇందిరమ్మ గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే
- అంగన్వాడీ భవనాలకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే.
.- పల్లె దవాఖానాలను ప్రారంభించిన ఎమ్మెల్యే..
- అమ్మమాట - అంగన్వాడీ బాట.. ఎగ్ బిర్యానీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే.
.- వివిధ ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన, లబ్దిదారులకు మంజూరీ పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

జయశంకర్ భూపాలపల్లి జూన్ 12, పేదలకు అండగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గం టేకుమట్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. టేకుమట్ల మండల కేంద్రంతో పాటు సుబ్బక్కపల్లి, అంకుషాపూర్, రామకృష్ణాపూర్(టీ), ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లి, పెద్దంపల్లి, వెలిశాల, రాఘవాపూర్, రామకృష్ణాపూర్(వీ), వెంకట్రావ్పల్లి(బీ), ఎంపేడు, వెల్లంపల్లి, కుందనపల్లి, గుమ్మడవెల్లి, ఆరెపల్లి, దుబ్యాల, రాఘవరెడ్డిపేట గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరీ పత్రాలను జిల్లా హౌసింగ్ పీడీ లోకీలాల్, ఎంపీడీఓ, ఎమ్మార్వో లతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై మంజూరీ పత్రాలను అందజేశారు. మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే ముందుగా ఇందిరమ్మ ఇళ్ల పైలట్ గ్రామమైన టేకుమట్ల లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న మాచర్ల సంధ్య - రాజేష్ లకు చెందిన నూతన గృహప్రవేశ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం వెంకట్రావ్ పల్లి(బీ) గ్రామంలో జరిగిన భూ భారతి అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం పలు గ్రామాల్లో సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం గరిమిళ్లపల్లి, వెలిశాల గ్రామాల్లో పల్లె దవాఖానాలను ప్రారంభించారు. సుబ్బక్కపల్లి, పంగిడిపల్లిలో అంగన్వాడీ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు ఉపయోగపడే పని చేస్తే వారి నుంచి వచ్చే స్పందన బాగుంటుందన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, లంచాలకు ఆస్కారం లేకుండా ఇండ్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పార్టీలకు అతీతంగా పేద, నిరుపేదలకు మొదటి విడతలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.

పంగిడిపల్లిలో ఎగ్ బిర్యానీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్సార్...

టేకుమట్ల మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంగిడిపల్లి గ్రామంలోని అంగన్వాడి - 2 సెంటర్లో జిల్లా సంక్షేమ అధికారిణి మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్ బిర్యానీ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం పిల్లలకు ఎమ్మెల్యే ఎగ్ బిర్యానీ ని వడ్డించారు. అంతకుముందు సుబ్బక్కపల్లి గ్రామంలో అమ్మమాట - అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించాలని లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఎగ్ బిర్యానీలను ప్రతి అంగన్వాడి కేంద్రాల్లో అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి వారానికి రెండుసార్లు ఎగ్ బిర్యానీ అందించనున్నట్లు తెలిపారు. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులందరినీ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. చిన్నారులకే కాకుండా గర్భిణీలు, బాలింతలకు కూడా మంచి పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

# సెలవులకు టాట...బడులకు బాట

విద్యార్థులకు పుస్తకాలు,దుస్తులు పంపిణీ
తొలి రోజున విద్యార్థులకు ఘన స్వాగతం
పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ

తాండూర్ జూన్ 12, తాండూర్ మండల్ లోని చంద్రపల్లి పాఠశాల గురువారం ప్రారంభంఅయ్యింది.విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు,దుస్తులు,బ్యాగులు పంపిణీ చేశారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపడం అభినందనీయమని అన్నారు. ఇంగ్లీష్ మీడియం బోధనతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. తొలిరోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు హెడ్మాస్టర్, టీచర్లు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యా భోధన చేస్తున్నామని తెలిపారు. మెరుగైన వసతులు కల్పించడంతో పాఠశాలలో అడ్మిషన్లు పెరుగుతున్నాయని అన్నారు.అనంతరం పాఠశాల చైర్మన్ పెండ్యాల చంద్రకళ మాట్లాడుతూ ఇన్నాళ్లు ఆట పాటలు, తాత, అమ్మమ్మ, నానమ్మలతో హాయిగా గడిపిన విద్యార్థులు బడిబాట పట్టేందుకు సన్నద్ధం అవుతున్నారు. వేసవి సెలవుల తర్వాత పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు అడుగులు వేస్తున్నారు. అడుగిడుతున్న కొత్త విద్యా సంవత్సరంలో ఎప్పటిలాగే అన్ని పాఠశాలలు పున:ప్రారంభం.బోసిపోయిన బడి గోడలు కొత్త అందాలు సంతరించుకొన్నాయి. నెలన్నర నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ చిన్నారుల కిలకిల రావాల ఆనందహేల గలగలా సవ్వడి చేసింది. అడుగులో అడుగు వేస్తూ బాల సైనికులు బడి ఒడిలోకి అడుగుపెట్టారు.దీంతో విద్యార్థులు తిరిగి బడిబాటపట్టనున్నారు. ఇన్నాళ్లు సెలవుల మజాను ఆస్వాదించి ఆటలు పాటలతో గడిపిన చిన్నారులంతా గురువారం నుంచి చదువుల ప్రపంచంలోకి అడుగుపెట్టనున్నారు అన్నారు. సెలవుల్లో ఆటపాటలు..బంధుమిత్రుల ఇళ్లలో కాలక్షేపం చేసిన బాలబాలికలు నేటి నుండి మళ్లీ బడిబాట పట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తు ప్రైవేటు పాఠశాలల ఆర్భాటపు ప్రచారాలకు ధీటుగా ఇంటింటికి తిరుగుతు తల్లిదండ్రులను కలిసి పిల్లలను సర్కార్ బడుల్లోనే చేర్పించాల్సిందిగా ప్రచారం సాగించారు అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దర్ శ్రీనివాస్,ఆర్ ఐ పద్మజా,పిల్లల తల్లిదండ్రులు చంద్రకళ,వనిత,పాఠశాల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య....

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ
పాఠశాలకు ఆకర్షణీయమైన బొమ్మలతో వాల్ పెయింట్ వేయించాలి
రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్ లో మండల ప్రాథమిక పాఠశాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం,జూన్ 12, ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.గురువారం రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్ లో మండల ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకోవాలని పాఠశాలలు ప్రారంభించిన మొదటి రోజే పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తుల పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి రోజు పిల్లలు సాయంత్రం పూట కొంత సమయం చదువుకోవాలని, కొంత సమయం ఆడుకోవాలని అన్నారు. మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాలని అన్నారు.బాల్యంలో చదువు, ఆటలు, ఆరోగ్యం చాలా కీలకమని అన్నారు. ఇంటి భోజనంతో మంచి ఆరోగ్యం వస్తుందని, బయటి ఫుడ్ తినవద్దని అన్నారు.పిల్లలు తమ లక్ష్యాలను ఒక పుస్తకంలో రాసుకొని ప్రతి రోజూ గుర్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ వేసవి సెలవులు అనంతరం సంతోషంగా పండుగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభించుకోవడం జిల్లా వ్యాప్తంగా జరుగుతుందని అన్నారు. ప్రతి వర్గానికి చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిల్లాలో మూతపడిన పాఠశాలలను పునః ప్రారంభిస్తున్నామని, పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రతి పిల్లవాడిలో మంచి టాలెంట్ ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వ పాఠశాలల్లో కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా పకడ్బందీగా కృషి చేస్తున్నామని అన్నారు. పాఠశాలలో ఏఐ టూల్స్ వినియోగించుకొని నాణ్యమైన ఆంగ్ల విద్య అందిస్తున్నామని అన్నారు.ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలో మెరుగైన ఫలితాలు వచ్చాయని తెలిపారు.గతంలో వైరా మండలం నారపనేనిపల్లిలో ఒకే విద్యార్థిని ఉన్న పాఠశాలలో 20 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారని, అక్కడ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించామని అన్నారు. ఉపాధ్యాయులు చాలా నిబద్ధతతో పని చేస్తున్నారని, సమన్వయం చేసుకుంటూ పక్కాగా విద్యార్థులకు బోధన అందేలా చర్యలు చేపట్టామని అన్నారు.అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. వంట గది, పిల్లల రూంను పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. పూర్వ ప్రాథమిక పాఠశాల క్రింద అంగన్వాడీ పని చేయాలని, పిల్లలకు ఆట వస్తువులతో చిన్న, చిన్న పాఠాలు సిలబస్ ప్రకారం బోధించాలని అన్నారు. పిల్లల ఎదుగుదల నిరంతరం మానిటరింగ్ చేయాలని, పిల్లలకు రెగ్యులర్ గా పౌష్టికాహారం అందించాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ బి. పురంధర్, రఘునాథపాలెం మండల తహసిల్దారు ఎస్. శ్వేత, ఎంపిడిఓ అశోక్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి, గ్రామ కార్యదర్శి వై. రాంబాబు, ఐసిడిఎస్. సూపర్వైజర్ జి. వెంకటలక్ష్మి, అంగన్వాడి టీచర్ జి. విజయ కుమారి, అంగన్వాడి హెల్పర్ బి. శ్రావణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం : ఆర్డీఓ వేణుమాదవ్‌రావు



పెన్‌పహాడ్, జూన్ 12 : భూ సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్డీఓ వేణుమాదవ్‌రావు అన్నారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం ధూపహాడ్ గ్రామంలో గురువారం తాసీల్దార్ లాలూ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. పలువురి రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని వారి వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని, సుధీర్ఘకాలంగా పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకుకోవచ్చన్నారు. భూ భారతి చట్టం ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా ఉందన్నారు. రెవెన్యూ సిబ్బంది మీకు అండగా ఉంటూ, మీ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.ధూహాడ్ గ్రామంలో రేషన్ దుకాణంలో సన్న బియ్యం మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయడంపై ఆర్డీఓ తనిఖీ చేశారు. చౌక ధరల దుకాణాలు సమర్థవంతంగా పనిచేయాలని, లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ఆదేశించారు. చౌక దుకాణాల పనితీరును పర్యవేక్షించడం, పీడీఎస్ ప్రయోజనాలు పారదర్శకంగా, సమర్థవంతంగా ఉద్దేశించిన లబ్ధిదారులకు చేరేలా చూడటం కోసం నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రంజిత్ రెడ్డి, ఏఆర్ఐ అజీజ భేగం, సీనియర్ అసిస్టెంట్ రాధ పాల్గొన్నారు.

# 90 డిగ్రీల మలుపుతో వంతెన నిర్మాణంపై విమర్శలు.. డిజైన్‌ను సమర్థించిన అధికారులు

భోపాల్: ఒక వంతెనను 90 డిగ్రీల మలుపుతో నిర్మించారు. ఆ బ్రిడ్జిపై వెళ్లే వాహనాలు ప్రమాదాల బారిన పడే అవకాశమున్నది. ఈ నేపథ్యంలో ఆ వంతెన నిర్మాణంపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే బ్రిడ్జి డిజైన్‌ను అధికారులు సమర్థించుకున్నారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. భోపాల్‌లోని ఐష్‌బాగ్ స్టేడియం సమీపంలో కొత్తగా రైల్వే ఓవర్ బ్రిడ్జి ని రూ.18 కోట్ల వ్యయంతో నిర్మించారు. 648 మీటర్ల పొడవు, 8.5 మీటర్ల వెడల్పు ఉన్న ఈ వంతెనలో ఒక చోట 90 డిగ్రీల మలుపు ఉన్నది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఐష్‌బాగ్ రైల్వే క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించే లక్ష్యంగా నిర్మించిన ఈ వంతెన ప్రారంభోత్సవానికి ముందే వివాదానికి కేంద్రంగా మారింది. 90 డిగ్రీల మలుపుపై విమర్శలు వెల్లువెత్తాయి. 'ఇది భోపాల్‌లోని ఐష్‌బాగ్ రైల్ ఓవర్ బ్రిడ్జి. దీనిని పూర్తి చేయడానికి పీడబ్ల్యూడీకి పదేళ్లు పట్టింది. ఇది ఒక రకమైన 'ఇంజనీరింగ్ అద్భుతం' లాంటిది. అధికారం, అవినీతి ప్రభుత్వాల చేతుల్లో ఉన్నప్పుడు, పుస్తకాలకే పరిమితమైన అసమర్థ ప్లానర్లు ప్రణాళికలు రూపొందించినప్పుడు, ఇంజనీర్లు మెరిట్ ద్వారా కాకుండా విరాళం ద్వారా డిగ్రీలు సంపాదించినప్పుడు, మీరు వంతెనలకు బదులుగా విపత్తులను పొందుతారు. 90 డిగ్రీల మలుపుతో ప్రమాదాలకు ఆహ్వానం' అని ఒకరు ఎక్స్‌లో మండిపడ్డారు. 'మరణం 90 డిగ్రీల కోణంలో వస్తుంది. మధ్యప్రదేశ్ రాజధాని నగరంలో ఉద్భవించిన అభివృద్ధి కోణం ఇది. వంతెన కోసం రూ.18 కోట్లు ఖర్చు చేశారు' అని మరో వ్యక్తి ఎద్దేవా చేశారు.మరోవైపు ఈ ప్రాజెక్టుకు చెందిన అధికారులు వంతెన డిజైన్‌ను సమర్థించుకున్నారు. మెట్రో స్టేషన్ కారణంగా అక్కడ తగినంత భూమి అందుబాటులో లేదని తెలిపారు. వేరే మార్గం లేక ఇలా నిర్మించినట్లు చెప్పారు. రెండు కాలనీలను అనుసంధానించడమే ఆర్వోబీ ఉద్దేశమని అన్నారు. చిన్న వాహనాలు మాత్రమే ఓవర్ బ్రిడ్జిని ఉపయోగించడానికి అనుమతిస్తామని వివరించారు. అయితే వంతెన నిర్మాణంపై వస్తున్న ఆరోపణలపై దర్యాప్తు జరుపుతామని పీడబ్ల్యూడీ మంత్రి రాకేష్ సింగ్ వెల్లడించారు.



# గల్లీలో గలీజ్ దందాలు.. ఢిల్లీలో గులాంగిరి.. రేవంత్ తీరుపై వేముల ప్రశాంత్ ఫైర్




హైదరాబాద్ : గల్లీలో గలీజ్ దందాలు చేస్తూ ఢిల్లీలో గులాం గురి చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తీరు ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల వీరేశం మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.నిన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చిట్ చాట్ చేశారు. మంత్రుల శాఖల కేటాయింపు కోసం, కాంగ్రెస్ పార్టీ అధినేతల అపాయింట్‌మెంట్ కోసం రెండు రోజులు ఢిల్లీలో పడిగాపులు కాసి అపాయింట్‌మెంట్ దొరకని ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నాడు. కేసీఆర్, కిషన్ రెడ్డి ఒక్కటే అని రేవంత్ రెడ్డి అన్న మాట అబద్ధం, అవాస్తవం. రేవంత్ రెడ్డి బీజేపీ ఒక్కటి అన్నది వాస్తవం. రేవంత్ రెడ్డి ,బీజేపీ దోస్తాన్ చాలా సార్లు బయట పడింది. లోక్‌సభ ఎన్నికల్లో బలహీన అభ్యర్థులను పెట్టి బీజేపీ ఎంపీలు గెలవడానికి రేవంత్ రెడ్డి సహాయ పడ్డారు. స్వయంగా ఈ మాట బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరిలో ఈటల రాజేందర్‌ను గెలిపించడానికి వేరే ప్రాంతం నుంచి సునీతా మహేందర్ రెడ్డిని నిలబెట్టారు. కిషన్ రెడ్డిని గెలిపించడానికి బీఆర్ఎస్‌లో ఉన్న దానం నాగేందర్‌ని సికింద్రాబాద్‌లో నిలబెట్టారు. కాంగ్రెస్ నుండి గతంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా పలుమార్లు పోటీ చేసిన అనుభవం ఉన్న జీవన్ రెడ్డికి కాదని ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేని వెలిచాల రాజేందర్‌కు కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌పై పోటీకి నిలిపారు. ఇలా నిజామాబాద్‌లో అరవింద్‌పై, మెదక్‌లో రఘునందన్‌పై, ఆదిలాబాద్‌లో నగేశ్‌లపై రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బలహీన అభ్యర్థులను నిలబెట్టారు. 8 మంది బీజేపీ ఎంపీలలో 7 మందిని రేవంత్ రెడ్డినే గెలిపించారు. బీజేపీ పార్టీ కూడా రేవంత్ రెడ్డిపై ఈగ వాలనివ్వడం లేదు అని వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తు చేశారు.స్వయంగా ప్రధాని మంత్రి మోదీ ఎలక్షన్ ప్రచారంలో తెలంగాణలో ఆర్ ఆర్ ట్యాక్స్ నడుస్తుంది అని మాట్లాడిన ఈడి, సీబీఐ ఎందుకు రావడం లేదు..? ఓటుకు నోటు కేసు ఎటుపోయింది, ఎందుకు జాప్యం జరుగుతోంది..? రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోయినప్పుడు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరకదు కానీ ప్రధానిని కలవడానికి 15 నిమిషాల్లో అపాయింట్‌మెంట్ ఎలా దొరుకుతుంది..? బండి సంజయ్ బహిరంగంగానే రేవంత్ రెడ్డి పదవి కాపాడుకోవాలని సూచనలు ఇస్తున్నాడు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా బొంద పెట్టడానికి కాంగ్రెస్, బిజెపి కలిసి పని చేయాలి అని బండి సంజయ్ అన్నారు. బీజేపీ కాంగ్రెస్ ఒక్కటే అనే సంకేతం బండి సంజయ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి బీజేపీలో జాయిన్ అయితే స్వాగతిస్తామని ఎంపీ అరవింద్ అంటున్నారు. ఇది రేవంత్ రెడ్డి, బీజేపీ దోస్తానకు సంకేతము కాదా..? నేను బీజేపీ స్కూల్‌లో చదువుకున్న అని రేవంత్ రెడ్డి ఢిల్లీలో అన్నారు. హైదరాబాద్‌లో అన్నది మోదీ విన్నాడో లేదో అని మళ్ళీ అవే మాటలు ఢిల్లీలో మాట్లాడిండు. బీజేపీలోకి వెళ్తాను అని సూచన ఇస్తున్నట్టున్నాడు. కాంగ్రెస్ పార్టీ వాళ్ళ రేవంత్ రెడ్డిని నమ్మకండి.. కాంగ్రెస్ పార్టీని ఖతం చేసి బీజేపీలోకి పోతారు అని ప్రశాంత్ రెడ్డి అన్నారు.కేసీఆర్ తెలంగాణకు ఆత్మ. తెలంగాణ కోసం కేసీఆర్ పోరాడుతున్న సందర్భంలో ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కు పెట్టిన రేవంత్ రెడ్డి తెలంగాణకు శత్రువు. ఏపీకి చంద్రబాబు నీళ్లు తీసుకెళ్తుంటే నోరు ముసుకున్న రేవంత్ రెడ్డి తెలంగాణ శత్రువు. కేసీఆర్ హయాంలో తలసరి ఆదాయంలో దేశంలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 4వ ప్లేస్‌కు, జీడీపీలో 4వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని 13వ స్థానానికి దిగజార్చిన నువ్వు తెలంగాణ శత్రువు. తెలంగాణ అప్పుల పాలైందని, తెలంగాణ ముఖ్యమంత్రిగా వెళ్తే దొంగలా చూస్తున్నారని తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు శత్రువు అని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు.బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణకి అన్యాయం చేస్తున్నారు.

# బాల కార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించండి : అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్

కొత్తగూడెం అర్బన్, జూన్ 12 : బడి ఈడు బాలలందరూ బడిలోనే ఉండాలని, బాల కార్మికులుగా ఎవరూ మిగిలిపోకూడదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆయన గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు.




విద్యా సంవత్సరం ప్రారంభమైనందున బడి ఈడు పిల్లలందరినీ కూడా పాఠశాలలో చేర్పించాలని, ఎవరు కూడా పని ప్రదేశంలో ఉండవద్దని, బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.'బడిబాట' కార్యక్రమం ప్రారంభమైనందున ప్రజలు, తల్లిదండ్రులు, అధికారులు అందరూ కలిసి నూరు శాతం పాఠశాలలో నమోదు జరిగే విధంగా కృషిచేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా రూపొందించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలలు ఎక్కడెక్కడ పని ప్రదేశాలలో ఉన్నారో గుర్తించాలని, జిల్లాలోని బడిఈడు బాలలందరూ తప్పనిసరిగా పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎండి. షార్ఫొద్దీన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి హరి కుమారి, డీసీపీయూ యూనిట్ బాధ్యులు అజీజ్, నాగరాజు, ఎయిడ్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ వి.రాజేశ్ పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కు కార్మికుల పోరాటానికి మద్దతుగా తాడేపల్లిగూడెంలోఏఐటీయూసీ ధర్నా!







తాడేపల్లిగూడెం , జూన్ 12 ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మికులు సాగిస్తున్న పోరాటం విజయవంతం అయ్యేవరకూ కార్మికవర్గం అండగా ఉంటుందని, రాష్ట్ర ప్రజలు కూడా వారికి మద్దతు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉక్కు కార్మికుల పోరాటానికి మద్దతుగా "దేశవ్యాప్త సంఘీభావ దినం" పాటించాలన్న ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ పిలుపు మేరకు తాడేపల్లిగూడెంలో ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన , ధర్నా నిర్వహించారు. వివిధ అనుబంధ సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ డిపో సెంటర్ కు చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నుండి తొలగించిన సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కార్మికుల జీతం బకాయిలు చెల్లించాలని, విశాఖ ఉక్కుకు సొంత గనిని కేటాయించాలని, నిజమైన పెట్టుబడి పెట్టాలని, సెయిల్ లో విలీనం చేయాలని , ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని, కార్మికులు పెద్ద పెట్టిన నినాదాలు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం భూములను కారుచౌకగా అదానీకి కట్టబెట్టే ఉద్దేశ్యంతోనే విశాఖ ఉక్కు పరిశ్రమను ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. పరిశ్రమను కాపాడటానికి కార్మిక సంఘాలు చేస్తున్న ప్రతిపాదనలను ప్రభుత్వం ఎందుకు పెడచెవిని పెడుతున్నదని ఆయన ప్రశ్నించారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జులై 9 వ తేదీ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సోమసుందర్ కోరారు. మారిన వాతావరణ పరిస్థితుల్లో శ్రామికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పనిగంటలు తగ్గించాలని ఒకపక్క కార్మికవర్గం కోరుతుంటే , రాష్ట్రంలో పది గంటల పని విధానం ప్రవేశపెట్టడం దారుణమని, దీన్ని ఉ ద్యోగ కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తాయని సోమసుందర్ స్పష్టం చేశారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కార్మికులు 1580 రోజులుగా సాగిస్తున్న పోరాటానికి మద్దతుగా దేశవ్యాప్త సంఘీభావ కార్యక్రమాలు చేపట్టాలన్న ఏఐటీయూసీ పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. తొలగించిన ఉక్కు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీ ఇచ్చామని ప్రభుత్వం అంటున్నా ఆ నిధులను బాకీలు తీర్చడానికి , వడ్డీలు కట్టడానికి వినియోగించారని వీర్రాజు వివరించారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి మందలపర్తి హరీష్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు నష్టాల్లో ఉన్నట్లు ప్రచారం చేయడం దాన్ని నిర్వీర్యం చేయడానికేనని అన్నారు. పరిశ్రమ పునరుజ్జీవనానికి సొంతగని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు , ఆంధ్రుల హక్కు నినాదంతో తెలుగు ప్రజలు సాగించిన పోరాటంతోనే ఉక్కు పరిశ్రమ ఏర్పడిందని , దాన్ని ప్రైవేటీకరించడానికి ప్రయత్నం చేయడం ప్రజల సెంటిమెంటుకు విరుద్ధమైనదని కళింగ లక్ష్మణరావు అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి అత్తిలి బాబీ, సీనియర్ నాయకులు అంకం భాస్కరరావు, రాజా వెంకట్రావు, మెండెం జేమ్స్, కోడె సాయి బాలాజీ, ఏఐటీయూసీ ఏరియా కమిటీ నాయకులు అల్లం కుమారస్వామి, కొడమంచిలి చంద్రరావు, మార్లపూడి కాటమరాజు, రౌతు రాజేష్ , పెద్దిరాజు, లక్కవరపు శ్రీనివాస్, తాడేపల్లి వెంకటేష్, కుంచె ఏడుకొండలు, గాది శ్రీనివాస్ , మాదాసు సత్యనారాయణ, సత్తిశెట్టి అప్పలరాజు, కర్రి వీర వెంకట సత్యనారాయణ, కుమార్, కే.నాగేశ్వరరావు , మేళం నాగరాజు, పిట్టా సాగర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలలోనే మానవీయ విలువలతో కూడిన విద్యా బోధన

### మన అంగన్వాడీ పిలుస్తోంది .. సామూహిక అక్షర భాస్యం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం జూన్ 12: చిన్ననాటి నుంచే మానవీయ విలువలతో కూడిన విద్యా బోధన అంగన్‌వాడీలలో అందిస్తున్నారని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం 39వ వార్డు దుర్గాపురం లోని అంగన్వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మన అంగన్వాడీ పిలుస్తోంది .. సామూహిక అక్షర భాస్యం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో ప్రవేశాల కల్పనకు ఐదేళ్లు పూర్తి చేసుకున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే లక్ష్యంతో మన అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. బడులతోపాటు సమాంతరంగా అంగన్వాడీల్లో పిల్లలను కొత్తగా చేర్చుకుని వారికి సామూహిక అక్షరాభ్యాసాలను చేయిస్తున్నామని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. అంగన్వాడీ పీడీ లక్ష్మి మాట్లాడుతూ ఈనెలాఖరు వరకు మన అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని, సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమాలను అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, లక్ష్మి కాంతం, సరళ, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, ఇందుకూరి రామలింగరాజు, మెరగని నారాయణమ్మ, నసీమా బేగం, భగత్ సింగ్, రామాయణం శ్రీనివాస్ కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం ప్రజా పాలనలో ఏడాది పూర్తి

### భీమవరం టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ సంబరాలు

భీమవరం జూన్ 12 సుపరిపాలనలో తొలి అడుగు పడిందని, ప్రజలు, ప్రజాస్వామ్యం గెలిచి ప్రజా పాలన ప్రారంభమై నేటికి ఏడాది అని రాజ్యసభ మాజీ సభ్యురాలు, టీడీపీ పొలిట్ బ్యూరో తోట సీతారామలక్ష్మి అన్నారు.



భీమవరం టీడీపీ కార్యాలయంలో పట్టణ టీడీపీ అధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సంబరాలను నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి మాట్లాడారు. విధ్వంసం నుండి వికాసం వైపు ప్రయాణం మొదలైందని, ఇచ్చిన ప్రతి హామీ ఒక పద్ధతి ప్రకారం కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో చెయ్యలేని ఎన్నో పనులను కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే పూర్తి చేసిందని, ప్రజల ఆశీర్వాదంతో ఏర్పాటైన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా పాలనలో ఏడాది పూర్తి చేసుకుందని, ప్రజల ఆకాంక్షలను తీర్చడం కోసం శక్తి వంచన లేకుండా కూటమి ప్రభుత్వం ప్రతి రోజూ పని చేస్తుందని అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మెరగని నారాయణమ్మ మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి, సుపరిపాలనలతో కూడిన రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజల ఆశీర్వాదంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కోకో పంటలకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం జూన్ 12పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం, చిన్న తాడేపల్లి గ్రామం నందు వికసిత్ కృషి సంకల్ప అధ్యం కార్యక్రమాన్ని డాక్టర్ రేఖ శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం వెంకటరమణ గూడెం వారిచే నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ కే మురళీకృష్ణ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ తాడేపల్లిగూడెం వారు పాల్గొని రైతులకు వరిలో మేలైన రకాలను ఎంపిక చేసుకోవడం మరియు ఎరువులను వాడటం మట్టి నమూనాలు సేకరించడం మరియు తగిన మోతాదులో ఎరువులను వేసుకోవాలని రైతులకు వివరించారు.

ఆర్ఎస్ ప్రసాద్ మండల వ్యవసాయ అధికారి గవర్నమెంట్ లో ఉన్న పథకాలు స్కీములు గురించి రైతులకు వివరించారు. డాక్టర్ రామచంద్రుడు ప్రథమ శాస్త్రవేత్త ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పంప్ రీసెర్చ్ వారు ఆయిల్ పామ్ పంటలో తీసుకోవలసిన మెలకువలు జాగ్రత్తలు గురించి వివరించారు.ముఖాముఖి గా కార్యక్రమంలో పాల్గొని రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. డాక్టర్ రేఖ శాస్త్రవేత్త కొబ్బరిలో మరియు కోకో పంటలో చేపట్టే వలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు మరియు చీడపీడల గురించి తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు.

## ప్రజల ఆశలకు ఊపిరి పోసిన కూటమి ప్రభుత్వ పాలన

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్





తాడేపల్లిగూడెం,జూన్12 : పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం, ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను ఉండాలన్న కృత నిశ్చయంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆ దిశగా విద్యార్థులకు పౌష్టిక ఆహారం, మంచి విద్య ను అందించేందుకు పాలన కొనసాగుతుందని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం నుండి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించిన సందర్భంగా గురువారం 25వ వార్డు, యాగర్లపల్లి స్పెషల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నందు ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న విద్యార్థిని విద్యార్థులకు సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా బొలిశెట్టి శ్రీనివాస్ ,సన్న బియ్యం బ్యాగ్స్ ను తాడేపల్లిగూడెం విద్యాశాఖధికారి మరియు స్కూల్ ప్రధానోపాధ్యాయులు కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి రాక్షస పాలన తో ప్రజలకు వెన్ను పోటు పొడిచిన వైసీపీ నేతలు నేడు వారు చేసిన అరాచకాలకు రెడ్ బుక్ రాజ్యాంగతో పని లేకుండా శిక్షలు అనుభవిస్తున్నారని అన్నారు. రైతు బాగుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది అన్న ఆలోచనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర చేస్తున్నారు అని ఆయన అన్నారు.

## రాక్షస పాలనా పోయే .. రామరాజ్యం వచ్చే

ప్రతి పేదవాడి కన్నీరు తుడిచేలా కూటమి పాలన

ఆంధ్రప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా కూటమి పాలన

ప్రజా తీర్పుకు .. ప్రజా చైతన్యానికి .. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏడాది పూర్తి .. ఎమ్మెల్యే అంజిబాబు




భీమవరం జూన్ 12 రాక్షస పాలనా పోయే .. రామరాజ్యం వచ్చిందని, ప్రతి పేదవాడి కన్నీరు తుడిచేలా కూటమి పాలన సాగిస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయినా సందర్భంగా భీమవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రజా తీర్పుకు .. ప్రజా చైతన్యానికి .. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏడాది పూర్తి అయ్యిందని, జనసేన పార్టీ 100 శాతం స్ట్రైక్ రేట్ విజయానికి ఏడాది అని, 5 ఏళ్ల అరాచక పాలనను తరిమికొట్టమని అన్నారు. ఆంధ్రప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా కూటమి పాలన సాగుతుందని అన్నారు. వ్యవస్థలో మార్పు తీసుకురావాలనే సంకల్పానికి ప్రజలు అండగా నిలిచి చారిత్రాత్మక విజయాన్ని అందించారని అన్నారు. గత తప్పిదాలను సరిచేస్తూ భావితరాలకు బంగారు భవిష్యత్తు అందించేలా రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్ర 2047దిశగా నడిపించేందుకు వికసిత్ భారత్ 2047 లో కీలక భాగస్వామిగా అయ్యేందుకు ఉమ్మడి ప్రణాళికతో రాజకీయాలకు అతీతంగా ఆంధ్రప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో మరింత సమర్థవంతమైనపరిపాలన అందిస్తామని, సంక్షేభివృద్ధి సాధించేలా మరింత బాధ్యతతో కృషి చేస్తామని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజిబాబు ను కూటమి నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

## గాడి తప్పిన రాష్ట్రానికి బాటలు వేసిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం,జూన్12పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం సంవత్సర పాలనపై కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అంగన్వాడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు లో విశ్వదుర్గేశ్వరి అమ్మవారి ఆలయము నందు మూడు సంవత్సరాల నిండిన బాల బాలికలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించే నిమిత్తం బొలిశెట్టి శ్రీనివాస్ బాల బాలికలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో భాగంగా బాలబాలికలచే అక్షరాభ్యాసం చేయించి పలకలు, బలపాలు, పుస్తకాలు మరియు పెన్నులను అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గాడి తప్పిన రాష్ట్రాన్ని కేంద్రంలో నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో కూటమి ప్రభుత్వం ఒక తాటిపై తీసుకువచ్చిందని ఆయన అన్నారు. చరిత్రలో కనీ విని ఎరుగని విధంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగించిందని అన్నారు. సూపర్ సిక్స్ ను అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంవత్సర పాలనకు గుర్తుగా తల్లికి వందనం రూ 8 వేల 900 కోట్లను నేడు నేరుగా తల్లుల ఖాతాలో జమ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ప్రజలకు మంచి జరగాలన్న సంకల్పంతో ఎన్డీఏ ప్రభుత్వం రానున్న రోజులలో ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లను అందించడం, ఆగస్టు 15 నుండి ఫ్రీ బస్సు సదుపాయం, టిడ్కో ఇళ్ల ను ప్రజలకు అందుబాటులో తీసుకురావడం వంటి అనేక పనులను అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో వివిధ పథకాల ద్వారా కోట్లాది రూపాయలను వెచ్చించి రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి లు వరాల జల్లు కురిపించినట్లు ఆయన తెలిపారు. అమరావతి అభివృద్ధికి రూ 48 వేల కోట్ల రూపాయలను, విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు రూ 11 వేల కోట్ల రూపాయలను నిధులను ప్రభుత్వం వెచ్చించి రాష్ట్ర అభివృద్ధికి మరో ఏడాదిలో రూపురేఖలు మార్చునున్నట్లు ఆయన అన్నారు. ఇంత జరుగుతున్న వైసిపి నాయకులు రాష్ట్రాన్ని దోచుకుని నేడు ప్రగల్బాలు పలకడం అపహాస్యంగా ఉందని అన్నారు. వారి పరిపాలనలో లిక్కర్ స్కాములు ,ఇసుక దోపిడీ వంటి అనేక సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి నేడు ప్రజలచే చీదరించబడ్డారని అన్నారు. అందువల్లనే 11 సీట్లతో ప్రజలు వారిని పరిమితం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఎన్నటికీ మరవదని ఆయన తెలిపారు.



PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com